గోతెలుగు.కామ్

చక్కటి కుటుంబ వార పత్రిక

# జూలై 2016
# కథలు




ప్రతీరోజ సాయంత్రం గ్రంథాలయానికి వెళ్ళడం నాకలవాటు. వాకింగ్ చేసినట్లూ ఉంటుంది.. కాసేపు దిన పత్రికలన్నీ తిరగేసినట్లుందని ఉంటుందని బయలు దేరుతాను. కాని వచ్చిన చిక్కంతా రోడ్డు దాటడమే... హైదరాబాదులో రోడ్డు దాటటమంటే మాటలు కావు.

అలనాటి 'పాతాళ భైరవి' సినిమాలో మాంత్రికుడు ఎస్వీ ఆర్, 'సాహసివిరా.. వర పుత్రుడివిరా.. సాహసం సేయరా ఢింభకా.. రాజ కుమారి లభిస్తుంది' అని ఆశ జూపిస్తూ.. ఎన్టీ ఆర్ ను కత్తుల ద్వారాన్ని దాటమన్నాడేమో..! గాని నేడైతే మన రోడ్లను దాటమనే వాడు.

ఈ షష్టి పూర్తి వయసులో గ్రంథాలయం మీది మక్కువ నన్ను జాగ్రత్తగా రోడ్డు దాటిస్తుంది.

ఆ రోజ యథావిధిగా హైదర్ నగర్ బస్ స్టాప్ వద్ద రోడ్డు దాటుతున్నాను. నా వెనకాలే వచ్చిన టీనేజీ అమ్మాయి నన్ను దాటేసి.. ప్రక్క నుండి కారు దాన్ని ఓవర్టేక్ చేస్తూ వస్తున్న టూవీలర్ నూ గమనించినా.. వాళ్ళే ఆగుతారులే.. అనే నిర్లక్ష్యపు ధోరణితో వెళ్తోంది. నేను ఆగి పోయాను. కారు, బండి మధ్యలో ఆమె నలిగి పోతుందేమోనని వణికి పోయాను. అమ్మాయి వీపుపై పుస్తకాల బస్తా కూడావుంది. అదృష్ట వశాత్తు త్రుటిలో ప్రమాదం తప్పింది.

“ఏంమ్మా.. అంత తొందరెందుకు? చూస్తూ.. చూస్తూ.. ప్రమాదాన్ని కొని తెచ్చుకుంటున్నావ్..” అని కాస్తా మందలింపు ధోరణిలో అన్నాను.. నావయసు ప్రభావమది.

“మైండ్ యువర్ బ్యుజినెస్” అంటూ నావైపు తీక్షణంగా చూసి అంతే వేగంతో వెడలి పోయింది.

‘గడుసు అమ్మాయే..’ అనుకున్నాను. అమ్మాయి చూపులు నన్ను ‘ముసలోడా.. నువ్వూ నేనూ ఒకటేనా..!’ అన్నట్లుగా ఉన్నాయి. ‘ఇంతేలే ఈ కాలపు పిల్లలు.. అయినా అది ఆ అమ్మాయి తప్పు కాదు. పెద్దలతో గౌరవంగా మాట్లాడాలని చెప్పే వృద్ధులు వాళ్ళ ఇంట్లో ఉండకపోవచ్చు. తల్లి దండ్రులకెక్కడిది సమయం.. పిల్లలకు మర్యాదలు నేర్పడానికి తీరికెక్కడిది..?’ అని మనసులో గొణుక్కుంటూ గ్రంథాలయం దారి పట్టాను.

ఒక గంట తరువాత గ్రంథాలయం నుండి బయలు దేరి దారిలో ఉన్న దేవాలయం వద్ద కాసేపు విశ్రమించి ఇంటి ముఖం పట్టాను. ఇది నా సంధ్యా సమయ నిత్య కృత్యం.

యాదృచ్ఛికంగా ఆ అమ్మాయి మళ్ళీ నా వెనకాలే వస్తోంది.. అది కాస్తా ఇరుకైన పూజా హాస్పిటల్ రోడ్డు.

ఎదురుగా వాటర్ ట్యాంకర్ బండి వేగంగా వస్తోంది. మూత సరిగ్గా లేక పోవడంతో ట్యాంకర్ లోని నీళ్ళు ఫౌంటెన్ లా విరజిమ్ముతూ ప్రక్కగా నడిచే వారిని పావనం చేస్తోంది. అది గమనించి నేను రోడ్డుకు ఇంకాస్తా పక్కకు తప్పుకున్నాను. అదే అదునుగా ఆ అమ్మాయి పరుగు రూపంలో నన్ను దాటేసి ముందుకు వెళ్ళింది. ఇంతలో ట్యాంకర్ ను ఓవర్ టెక్ చేసిన కారు సైడు మిర్రర్ అమ్మాయిని రాసుకుంటూ రన్ వే పై విమానంలా వెళ్ళిపోయింది.

అమ్మాయి భయంతో “అమ్మా ..!” అంటూ కేక పెట్టి నేలపై నా ముందు పడి పోయింది. పెద్దగా గాయ పడినట్లుగా లేదనుకొని ‘తిక్క కుదిరింది..’ అనుకున్నాను మనసులో..

గడుసు అమ్మాయికి కాలు బెణికినట్లుంది.. లేచి సరిగ్గా నిల్చోలేక పోతోంది. నా వంక దీనంగా చూసింది.

“మైండ్ యువర్ బ్యుజినెస్” అంటూ నేను వెటకరించి వెళ్ళి పోయాను.

సమయ పాలన ప్రభావమేమో..! పది రోజుల తరువాత గడుసు అమ్మాయి మళ్ళీ కనబడింది. నేను ఆమెను చూడనట్లే నటిస్తూ.. రోడ్డు దాటే ప్రణాళికలో ఉన్నాను. నా బట్ట తల.. సోడా బుడ్డి కళ్ళద్దాలను చూసి అమ్మాయి గుర్తు పట్టినట్లుంది."హలో.. తాతయ్యా.. గుడ్ ఈవినింగ్.." అంటూ నా పక్కకు చేరింది.

"హలో మైండ్ యువర్ బ్యుజినెస్" అన్నాను ఠక్కున.. ఎవరైనా తనని అకారణంగా ఒక మాట అంటే దానినే పదే పదే వల్లె వేయటం వృద్ధాప్యంలో సహజం అనుకుంటాను.. నా నోటికి అలా వచ్చేసింది.. అనకపోవాల్సింది అనుకున్నాను.

అమ్మాయి కాస్త నొచ్చుకున్నట్లు బుంగ మూతి పెట్టింది.

"సారీ తాతయ్యా.. నా పేరు పృశ్ని" అంది.

"పృశ్ని.. గుడ్ నేమ్.. దాని అర్థమేంటో తెలుసా?" తనను మంచి చేసుకోవాలనే ధోరణిలో అడిగాను.

"నో.. తెలీదు" అంటూ తన గులాబి పెదవులను విప్పింది.

"కిరణం .. ఎ రే ఆఫ్ లైట్. అది శ్రీకృష్ణ పరమాత్ముని తల్లి దేవకి మరో పేరు కూడా.." అంటూ పరమాత్ముడు అంటే తెలుసో తెలయదో అని "ది గాడ్ శ్రీకృష్ణ" అని రెండు చేతులతో నమస్కరిస్తూ అర్థమయ్యేలా చెప్పాను.

" ఓ..! ఐసీ..!!" అంది. అమ్మాయి కళ్ళు మిల మిలా మెరిసాయి.

"అవునూ.. ఎలా ఉంది.. నీ కాలు నొప్పి? పూర్తిగా తగ్గిందా.." అంటూ వాకబు చేసాను.

"తాతయ్యా.. మీరా రోజు చాలా హెల్ప్ చేసారు. లేకుంటే ఇంత త్వరగా నడిచే దాన్ని కాను" అమ్మాయి మాటల్లో ఏంతో

ఆర్ద్రత కనబడుతోంది.

"నేనేం చేసాను..?"

"నాకు బుద్ధి రావాలనే అలా వెక్కిరించి వెళ్ళారు. బట్.. యు ఆర్ వెరీ నోబెల్ మాన్. హెల్ప్ డ్ మి ఎలాట్.. మీరు వెళ్లి ఒకతనికి డబ్బులిచ్చి నా వద్దకు పంపించారు. నేను చూసాను.. అతడు నన్ను పూజ హాస్పిటల్ కు తీసుకెళ్ళి పట్టీ కట్టించాడు. మందులిప్పించాడు. మా ఇంట్లో దిగ బెట్టాడు. మా నాన్న గారు డబ్బులిస్తుంటే తీసుకోలేదు.. మీరు తీసుకోవద్దన్నారట.. చాలా థాంక్స్ తాతయ్యా.. డాక్టర్ వన్ వీక్ రెస్టు తీసుకొమన్నారు.. ఈ రోజే స్కూల్ కు వెళ్లి వస్తున్నాను"

ఇదేమి గొప్ప విషయం కానట్లుగా నేను రోడ్డు దాటుతుంటే.. నాచేయి పట్టుకుంది పృశ్ని. నాకు ఎనలేని ఆత్మీయతా బావం కలిగింది. రోడ్డు ప్రమాదంలో అసువులు బాసిన నా ముద్దుల మనవరాలు గుర్తుకు వచ్చి కంట తడి పెట్టించింది. నిత్యం వెళ్ళే స్కూల్ బస్సే ఆమె ప్రాణాలను కబళించింది. లిప్త కాలం అచేతనుడై పోయాను. గడుసు అమ్మాయి అనుకున్న పృశ్ని ఈ రోజు నన్ను రోడ్డు దాటించింది.




విషయం విన్న రామచంద్ర కుప్పకూలిపోయాడు. సహోద్యోగులు సపర్యలు చేశాక మెల్లగా కళ్ళుతెరిచాడు. పదవ తరగతికి పాఠం చెపుతుండగా ఫోన్ వచ్చింది.

"మీ అమ్మాయి శ్వేత ఆత్మహత్య చేసుకుంది..." మాట పూర్తి కానే లేదు.

"నో..."విరుచుక పడి పోయాడు. ఒక్క సారిగా విభ్రాంతికి లోనైనాడు.

వార్త దావానలంగా పూరంతా ప్రాకి పోయింది.

వెంటనే పట్నానికి బయలు దేరాడు రామచంద్ర కొలీగ్స్ తో.

"బాడీని పోస్ట్ మార్టం కోసం హాస్పిటల్ కి తీసుకెళ్ళారు" అన్నారు కాలేజ్ యాజమాన్యం.

అక్కడ్నుంచి హాస్పిటల్ కి పరుగు.

"ఒక్క సారి చూడనివ్వండి నా పాపను..." బ్రతిమలాడాడు.

"నో. ఇప్పుడు కుదరదు. పోస్ట్ మార్టం అయ్యాక తీసుకెళ్ళండి." హాస్పిటల్ సిబ్బంది కేకలేశారు.

"రాత్రి ఫోన్లో మాట్లాడింది. మామూలు గానే మాట్లాడింది. తనకేదైనా ప్రాబ్లెం ఉంటే నాతో చెప్పేది. నా దగ్గర

ఏదీ దాచదు. రాత్రి బాగున్న పాపకేమయింది.." పిచ్చిగా రోదించాడు రామచంద్ర.

" తల్లిలేని పిల్లని అపురూపంగా పెంచుకున్నాను. ఏమయింది...ఇంతలో ఏమయింది. చూశారా సార్! నా పాప ఆత్మహత్య చేసుకుందట!...అంత పిరికిదా నా పాప!...నో ....నా శ్వేత అంత పిరికిది కాదు. ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కానే కాదు." కొలిగ్స్ ఎంత ఓదార్చినా రామ చంద్ర దుఃఖం ఆగ లేదు.

శ్వేత అందమైన అమ్మాయి. భవిష్యత్ పై ఎన్నో కలలు కన్నది. ఏదో సాధించాలని తపన పడేది. ఉన్నత శిఖరాలధిరోహించి సమాజ సేవ చేయాలని; ఎన్నో...ఎన్నెన్నో కలలు ఆ కళ్ళల్లో ...కాని ఇప్పుడు ఆ కళ్ళు శాశ్వతంగా మూత పడి పోయాయి. ఒక లేత గులాబి అర్థాంతరంగా రాలి పోయింది.

శ్వేత ఫ్రెండ్స్ వచ్చారు. "ఇది ఆత్మ హత్య కాదు. హత్యే." అన్నారు.

" తన బిడ్డను హత్య చేయాల్సిన అవసరం ఎవరికి ఎందుకొచ్చింది?" రామచంద్ర మౌనంగా రోదించాడు.

ఇంతలో మహిళా సంఘాలొచ్చాయి. ప్రజా సంఘాలొచ్చాయి. విద్యార్థి సంఘాలొచ్చాయి.

"శ్వేతది ఆత్మ హత్య కాదు...హత్యే. నిందితుల్ని శిక్షించాలి. కాలేజ్ యాజమాన్యాన్ని అరెస్ట్ చేయాలి"

అరుపులు......కేకలు......స్లోగన్స్ మిన్నుముట్టాయి.

పోలీస్ లొచ్చారు. "అందర్నీ వెళ్ళిపొమ్మ"ని వార్నింగిచ్చారు.

అయినా విద్యార్థులు ఆపలేదు. హాస్పిటల్ ముందు ఉధృత పెరిగి పోయింది. విద్యార్థులు కదం తొక్కారు. నినాదాలతో మిన్నుముట్టింది. క్షణాల్లో పోలీస్ వ్యాన్ వచ్చి ఆగింది. ఏం జరుగుతుందో తెలిసే లోపలే అన్నీ జరిగి పోయాయి. రాళ్ళు రువ్వడాలు; లాఠి చార్జీలు; ఫైరింగ్...ఇద్దరి పిల్లల ప్రాణాలు గాలిలో కలిసి పోవడం..144 సెక్షన్ విధించడం... ఎక్కడి కక్కడ అరెస్టులు.

రామచంద్రానికి ఏమీ అర్థం కావడం లేదు. అసలేమి జరిగిందో; ఏమి జరుగుతుందో అర్థం కాక తల పట్టుకున్నాడు.

సాయంత్రానికి డెడ్ బాడీ ఇచ్చారు. శవాన్ని చూసి బావురుమన్నాడు రామచంద్ర. నిన్న నవ్వుతూ మాట్లాడిన తన శ్వేత ఇపుడు విగత జీవిగా తిరిగొచ్చింది. జరగాల్సింది కొలిగ్స్ దగ్గరుండి జరిపించారు. అంతా యాంత్రికంగా చేశాడు. మరో వారం రోజులు పట్టణం అట్టుడికి పోయింది. బంధ్ పాటించారు. రాష్ట్రమంతా కాలేజ్ లు మూత పడ్డాయి. "శ్వేతకు న్యాయం జరగాలి. నిందితుల్ని శిక్షించాలి." నినాదాలు మిన్నుముట్టాయి. విద్యార్థులు; మహిళా సంఘాలు కదం త్రొక్కాయి." ఆడ వారికి రక్షణ లేకుండా పోయింది." ప్రతి పక్షాలు నినదించాయి. రాష్ట్ర వ్యాప్త బంద్ కు పిలుపునిచ్చాయి. రెండు బస్సులు దగ్ధమయ్యాయి. విద్యార్థులు; పోలీస్ లు పరస్పరం రాళ్ళు రువ్వుకున్నారు. కొంత మందికి గాయాలయ్యాయి. కొంత మంది హాస్పిటల్ పాలయ్యారు. అన్ని టి. వి. లు లైవ్ కవరేజ్ చేశాయి. బంద్ విజయ వంతం అన్నాయి కొన్ని. బంద్ ఫ్లాప్ అన్నాయి మరి కొన్ని. ప్రభుత్వం ఆఘు మేఘాల మీద ఎంక్వైరీ కమీషన్ వేసింది. " చట్టం తన పని తను చేసుకుపోతుంది. దోషులు ఎవరైనా; ఎంతటి వారినైనా శిక్షిస్తాం. వదిలి పెట్టే ప్రసక్తే లేదు." ప్రభుత్వం ప్రకటించింది.

పది రోజులు అట్టుడికిన రాష్ట్రం క్రమంగా సాధారణ స్థితికొచ్చింది. విద్యార్థులు చల్ల బడ్డారు. పోలీస్ లు స్థిమిత

పడ్డారు. ప్రతి పక్షాలు శాంతించాయి. పరిస్థితులు చక్క పడ్డాయి. తను షాక్ నుంచి తేరుకోక ముందే తన ప్రమేయమే లేకుండా; తనకు తెలియకుండానే ఎన్నో జరిగి పోయాయి.

చట్టం తన పని తను చేసుకు పోతూనే ఉంది. రోజులు గడిచి పోతున్నాయి. కానీ శ్వేత కేస్ మాత్రం కొలిక్కి రావడం లేదు. ఒక శుభోదయాన 'శ్వేతది ఆత్మ హత్యే' అని తేల్చేసి ఫైల్ క్లోజ్ చేసేశారు పోలీస్ లు; చాలా ప్రశ్నలకు సమాధానాలు రాకుండానే.

'రాత్రి ఒంటి గంటకు బాత్రూం కి వెళ్ళిన దీప్తి మొదట చూసిందట. వెంటనే వార్డెన్ కి ఇంఫార్మ్ చేసిందట." - ఇదీ కాలేజ్ యాజమాన్యం కధనం.

ఇటీవల జరిగిన సెమిస్టర్లో అనుకున్నంత మార్కులు రాలేదని బాధ పడిందని- ఆత్మహత్యకు అదే కారణం కావచ్చని కాలేజ్ వారి వాదన.

"ఇది ఆత్మ హత్య కాదని; ముమ్మాటికి హత్యే నని- దీని వెనక ఎవరిదో పెద్దల హస్తం ఉందని- దాన్ని వెలికి తీయాలని"- మహిళా సంఘాల వాదన.

పోస్ట్ మార్టం రిపోర్ట్ మార్చేశారని; డాక్టర్ అమ్ముడు పోయాడని - తెర వెనుక ఏదో జరిగిందని -విద్యార్థుల వాదన.

ఇందులో ఎవరిది తప్పో; ఎవరిది ఒప్పో తన కనవసరం.

తనకు కావలసింది నిజం. అసలు ఆ కాళ రాత్రి ఏం జరిగింది? తన బిడ్డ చావు మిస్టరీ ఏంటి? రాత్రి ఒంటి గంటకు చనిపోతే; ఉదయం ఏడు గంటలకు పోలీస్ రిపోర్టిచ్చారు. వెంటనే ఎందుకివ్వలేదు? పోలీస్ లు హడావుడిగా హాస్పిటల్ కెందుకు తరలించారు? పోస్ట్ మార్టం కు ఎందుకంత తొందర పడ్డారు? తండ్రికి పద కొండుకు ఇంఫార్మ్ చేశారు? వెంటనే ఎందుకు చెయ్యలేదు? తండ్రినెందుకు బాడీని చూడనివ్వలేదు? ఎక్స్ గ్రేషియా ఇచ్చి దులుపేసుకోవాలని ఆత్ర పడుతున్నారు? వెనుక ఎవరి హస్తం ఉంది? ఎన్నో అనుమానాలు? మరెన్నో సందేహాలు? దేనికీ సమాధానాలు లేవు. తనకు న్యాయం చేయమని ...ఎందరినో కలిశాడు. ఎన్నో మెట్లెక్కాడు. మహిళా సంఘాలు; విద్యార్థి సంఘాలు రోడ్లెక్కాయి. ప్రజలంతా ముక్త కంఠంతో ఖండించారు.

అయినా తేల్చ వలసిన వారు తేల్చేశారు; అది ఆత్మ హత్యే నని. అన్ని ఫైల్స్ మూసేశారు. అన్ని ద్వారాలు మూసుకు పోయాయి. టిచరయి ఉండీ; తన పాపకు న్యాయం చేయలేకపోయాడు రామచంద్ర. తన పిచ్చి గానీ...చని పోయాక న్యాయమేంటి? గుండెలు పగిలేలా ఏడ్చాడు. ఆ కన్నీళ్ళకు ఓదార్పు లేదు. ఆ బడబాగ్ని ఆరేది కాదు.

***********************************

రెండేళ్ళు గడిచాయి. గీత టెంత్ లో స్టేట్ ఫస్టొచ్చింది. పేపర్లలో; టీ .వీ .లలో గీత పేరు మారు మ్రోగుతోంది. రాష్ట్ర నలు మూలల నుంచి అబినందనల వర్షం కురుస్తోంది. రామచంద్ర ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. తన కల సాకారమయింది. తన పాఠశాల పేరు ఆ లిస్ట్ లో రావాలని కలలు కన్నాడు. ఇపుడు డబుల్ ధమాకా! స్టేట్ ఫస్ట్ తన

పాఠశాలదే కాదు. తన కూతురిది కూడా. కూతురి ద్వారా పాఠశాల పేరు కూడా మారు మ్రోగుతోంది. తట్టుకోలేని ఆనందం ... ఇప్పుడు తన భార్య.. పెద్ద కూతురు శ్వేత ఉండి ఉంటే ... ఎంత బావుండేదో?

"గీతను మా కాలేజ్ లో చేర్పించండి. అన్నీ ఉచితంగా ఇస్తాం. మా కాలేజ్ లో చేర్పించండి." " మా కాలేజ్ లో ... మా కాలేజ్ లో ...." ఆఫర్లే...ఆఫర్లు. పోస్ల మీద పోస్లు. రాష్ట్రం లోని టాప్ విద్యా సంస్థలన్నీ పోటీ ల మీద పోటీలు.

స్టేట్ టాపర్ని తమ తమ కాలేజ్ లలో చేర్చుకోవాలని స్టేట్ టాప్ కాలేజ్ లన్నీ తెగ తాపత్రయ పడ్డాయి.

అందరికీ రామచంద్ర సమాధానం ఒక్కటే. గతం తాలూకు గాయం ఇంకా ఆర లేదు. అది ఆరేదీ కాదు.

గత ప్రశ్నలకే అతనికి సమాధానాలు ఇంకా దొరక లేదు. ఉత్పన్నమయ్యే మరి కొన్ని ప్రశ్నలకి సమాధానాలకి ఎదురు చూసే ధైర్యం తన గుండెకి లేదు.

"చదువు లేక పోయినా ఫర్వాలేదు... నా పాప కళ్ళ ముందు బ్రతికుంటే చాలు." దృఢంగా అన్నాడు రామచంద్ర .

"అదేంటి? స్టేట్ టాప్ ర్యాంకర్ని చదివించరా? ..." విస్తు పోయారు కాలేజ్ వారు.

"ఒక సారి మోసపోయి పెద్దమ్మాయిని పోగొట్టుకున్నాను. చదువులో ర్యాంక్ రాకపోయినా ఫర్వా లేదు . నా పాప కళ్ళ ముందు బ్రతికుంటే చాలు." గుండె లోని ఆవేదన కరిగి కన్నీళ్ళయ్యాయి.

ప్రశాంతంగా చదువుకునే వాతావరణం ఏ కాలేజ్ లోనా ఉందా? ర్యాంక్ రాక పోయినా ఫర్వాలేదు. . ఏ కాలేజ్ అయినా నా పాప ప్రాణాలకి హామీ ఇవ్వగలదా?" ప్రశ్నించాడు రామచంద్ర.

ఒక తండ్రి ఆవేదన అర్థం చేసుకోవచ్చు. కాని ఒక బ్రిలియంట్ స్టూడెంట్ భవిష్యత్ మాటేమిటి? ఈ ప్రశ్నకు బదులేదీ? *



“ఒరేయ్!సీతారామ్,నేనూ అమ్మ హైదరాబాద్ వస్తున్నాం.సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ కి రా!”నాన్న ఫోన్..

“అదేంటి చెప్పాపెట్టకుండా వస్తున్నారు. ఏ ఏమయింది? అడిగా ఫోన్లో

“ ఆ! ఏమీ లేదు ఈ మధ్యన తరుచుగా కడుపులో నెప్పి వస్తుంది అని ఇక్కడ డాక్టరుకి చూపిస్తే ఒక్కసారి పెద్ద హాస్పిటల్ వెళ్ళి పరీక్ష చేయించుకోండి అన్నారు.అందుకే అక్కడ కొచ్చి ఒకసారి చూపించు కొందామని” అన్నారు

“సరే, అలాగే నేను రైల్వే స్టేషన్ కి వస్తా” అని ఫోన్ పెట్టేసా. రైల్వే స్టేషన్ కి వెళ్ళి అమ్మ, నాన్నని ఇంటికి తీసుకొచ్చా. అప్పటికే పిల్లలు సాత్విక, శ్రీరామ్ కాన్వెంట్ కి వెళ్ళి పోయారు. వాళ్ళు కాన్వెంట్ నుంచి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఇద్దరు కొత్త వ్యక్తులు కనిపించే సరికి “ఎవరు డాడీ!” మా అబ్బాయి నాన్న ఎదురుగానే ప్రశ్న. నాకు షాక్! వెంటనే నాన్నే సమాధానమిచ్చారు

“నేను మీ నాన్న నాన్నని అంటే తాతని, అదుగో అక్కడ కూర్చుందే ఆవిడ మీ నాన్న అమ్మ అంటే నానమ్మ” అన్నారు. నా పిల్లలకు తాత, నానమ్మలను వాళ్ళే పరిచయం చేసుకోవటాన్ని విస్తుపోయి చూస్తుంటే నాన్నే అన్నారు దీనికి కారణం ఒక రకంగా మనమే ఎందుకంటే ఎప్పుడో పిల్లల చిన్నపుడు తీసుకొచ్చావు, తర్వాత ఏ సందర్భంలో వచ్చినా కోడలు, నువ్వు రావడమే, అలాగే మేం కూడా ఇక్కడికి పిల్లలకి కాస్త జ్ఞానం తెలిసిన తర్వాత రావడం ఇదే ప్రధమం. అందుకే వాళ్ళననుకోవలసిన పనేం లేదు” అనేసరికి నిజంగా సిగ్గనిపించింది.

**************************

నాన్నకి హాస్పిటల్ లో గాస్ట్రో ఎంట్రాలజిస్ట్ కి చూపిస్తే అన్ని పరీక్షలు చేసి లివర్ కేన్సర్ చివరి దశలో ఉందని తేల్చారు. వయసు రీత్యా ఈ స్థితిలో ఆపరేషన్ లేదా కిమో థెరపి ఏవి అంత ఉత్తమం కాదని ఇక రెండు నెలలు మాత్రమే అని చెప్పేసారు. నాన్నకి ఈ విషయాలేవి చెప్పకుండా తగ్గడానికి ఇంకా కొద్ది కాలం పడుతుంది ఇక్కడే ఉండండి అని చెప్పా. అతి కష్టం మీద ఒక పది రోజులున్నారు. ఈ లోపు స్వగ్రామం లోని బంధు మిత్రులకు తెలిసి పరామర్శలు. అందరూ ఒకటే గొడవ, అక్కడకు పంపించేయ్! అక్కడ మేమంతా ఉన్నాం కదా మేం చూసుకొంటాం అని. అక్కడే నాక్కూడా కాల క్షేపం అని చెప్పి అమ్మ, నాన్నలు మా సొంతూరికి వెళ్ళిపోయారు. నిజం గానే మా బంధు మిత్రులు చెప్పినట్లుగానే నాన్నకు ఏ లోటు రాకుండా చూసుకొన్నారు అందుకే రెండు నెలలన్నది ఆరు నెలలు గడిచిన తర్వాత చని పోయారు. పిల్లలకు అదే సమయంలో పరీక్షలుండటంతో స్నేహితుల ఇంట

ఉంచి నేను, నా భార్య కార్యక్రమాలకు హాజరయ్యాం.

మేము ఇద్దరం అన్నతమ్ములం. అన్నయ్య రఘురామ్, అక్క చెళ్ళెళ్ళు ఇద్దరు అక్క ఉమ, చెల్లి హైమ. అన్నయ్య రఘురామ్ ఉద్యోగ రీత్యా దూరంగా ఉన్నాడు. అన్నయ్యకు కూడా అబ్బాయి, అమ్మాయి. అబ్బాయి పేరు జయరామ్, అమ్మాయి పేరు జనని. వాళ్ళ పిల్లలకు పరీక్షలుండటంతో అన్నయ్య వదినలు మాత్రమే వచ్చారు. ఊరు ఊరంతా మా ఇంటి దగ్గరే ఉండి అందరూ తలో బాధ్యత తీసుకొని నాన్న గారి కార్యక్రమాలన్నీ చక్కబెట్టారు. కార్యక్రమాలన్నీ పూర్తి అయిన తరువాత అమ్మను మా వద్దకు తీసుకొని వెళ్ళి పోతామంటే అమ్మ కూడా ఆ ఇంటిని విడిచి పెట్టి రానని అక్కడే ఉండి పోయింది.

**********************

మరల చాలా రోజుల తర్వాత మా చిన్నాన్న వాళ్ళ చిన్నబ్బాయి పెళ్ళికని అన్నయ్య కుటుంబం, మా కుటుంబం మా స్వగ్రామం వచ్చాం. మా అబ్బాయి, మా అన్నయ్య వాళ్ళ అబ్బాయి ఆడుకొని వీధి అరుగు మీద మేం కూర్చున్న చోటికి వచ్చి కూర్చున్నారు. మా అన్నయ్య వాళ్ళ అబ్బాయి జయరామ్ ని అడిగా “ఒరేయ్! నేనెవరో తెలుసా అని!” దానికి వాడిచ్చిన సమాధానం విని మరల షాక్!! వాడి సమాధానం ఏంటంటే “మీరు శ్రీరామ్ వాళ్ళ డాడీ కదా!”. నిజంగా చాలా బాధ వేసింది. మా అబ్బాయి ద్వారా నేను పరిచయం కాబడటం. ఆలోచిస్తుంటే ఇపుడు అన్పిస్తుంది, మనుష్యుల మధ్య బాంధవ్యాలు ఎంత కృత్రిమంగా తయారయినాయో! గతంలో ఉమ్మడి కుటుంబాలకు, ఇప్పటి ఏకాకి కుటుంబాలకు మధ్య వ్యత్యాసం, అలాగే ఉద్యోగ బాధ్యతలతో ఉరుకుల పరుగుల జీవితాన్ని గడుపుతూ ఆప్యాయతలు, అనురాగాలను ఎంతగా గాలికి వదిలేసామో! అలా ఆలోచిస్తూ ఉంటే గతంలోకి జారుకొన్నాయి నా తలపులు.

**********************

ప్రతి పండగలకు కుటుంబ సమేతంగా మేము మా మావయ్యల ఇంటికో, మేనత్తల ఇంటికి వెళ్ళడమో లేదా వాళ్ళు మా ఇంటికి రావడమో జరిగేది. ఉదయాన్నే చేల గట్ల వెంబడి తిరగటం, మామిడి చెట్లెక్కి మామిడి కాయలు కోసుకోవడం, ఈత పళ్ళు రాలగొట్టి అవి పంచుకొని తినడం,సాయంత్రమయ్యే సరికి కాలువలో ఈత కొట్టడం….ఒకటా, రెండా ఎన్నెన్నో మధుర జ్ఞాపకాలు. ఆ పండగ రోజులన్నీ ఎంతో ఉత్సాహంగా ఆనందంతో ఆట పాటలతో గడిచి పోయేది. ఆ ఆనందాన్ని, ఉత్సాహన్ని మూట గట్టుకొని మరల వచ్చే పండగ కోసం ఎదురు చూసేవాళ్ళం. అలాగే బంధు మిత్రులలో ఎవరికి ఏ ఆపద గాని, అనారోగ్యమొచ్చినా క్షణాల్లో వాలి పోయి అక్కడుండి కంటికి రెప్పలా కాపాడుకొనేవారు.

******************

“చిన్నాన్నా! డాడీకి హార్ట్ ఎటాక్ వచ్చింది. అర్జంటుగా రండి” మా అన్నయ్య వాళ్ళ అబ్బాయి జయ రామ్ ఫోన్. వెంటనే బయలు దేరి వెళ్ళా. అప్పటికే జరగరానిది జరిగి పోయింది. అన్నయ్య చని పోయాడు. అన్నయ్య పార్థివ దేహం ప్రక్కన వాళ్ళ అబ్బాయి జయ రామ్ ఒక్కడే ఉన్నాడు. ఎవరెవరో వస్తున్నారు. ఒక్క క్షణం పలకరించి వెళ్ళి పోతున్నారు. అన్నయ్య అంత్య క్రియలు జరిపే చోటు కి తీసుకెళ్ళడానికి “కైలాస రథం” పేరుతో గల వాహనాన్ని పంపించమని జయరామ్ ఫోన్ చేసాడు. దానిలో అన్నయ్య పార్థివ దేహంతో పాటు నేను, వాళ్ళ అబ్బాయి జయరామ్ అనుసరించాము. కార్యక్రమాలన్నీ పూర్తి చేసుకొచ్చాం. ఈ సంఘటనతో నాకు పూర్తిగా జ్ఞానోదయమయ్యింది. ఇన్నాళ్ళుగా ఈ ఉరుకుల పరుగుల జీవితంలో ఏం కోల్పోయామో! ఆత్మీయంగా పలకరించడం మాట అటుంచి కనీసం కూడా నలుగురు రాని పరిస్థితి. ఆ క్షణమే నిర్ణయం తీసుకొన్నా! చుట్టూ ఉన్న నలుగురి కష్ట సుఖాలలో పాలు పంచుకోవడం, సొంత ఊరికి వీలు చూసుకొని కుటుంబం తో సహా సందర్శించడం, అలాగే ఇకపై ప్రతి పండుగకు ఖచ్చితంగా కుటుంబ సమేతంగా బంధు మిత్రుల యింటికి మేమే వెళ్ళడమో, వాళ్ళని ఆహ్వానించడమో చేయాలని స్థిరంగా నిశ్చయించు కొన్నా. దానిలో భాగంగా రాబోయే పండగ కోసం ఆతృతగా ఆత్మీయత, ఆప్యాయతలతో కూడిన ఆ మధుర క్షణాలను ఆనందించేందుకు వేచి చూస్తున్నా...




“నీకసలు బుద్ధుందా? నిశ్చితార్థం అయి పోయి, ఇంకో నాలుగు రోజుల్లో పెళ్లి పెట్టుకొని, ఇప్పుడు నాకీ పెళ్లొద్దంటావా?” చెల్లెలు వెన్నెలపై మండి పడుతున్నాడు శరత్. “నీకూ నచ్చాడన్నావు కదా, మరిప్పుడేమయిందో చెప్పు?” తండ్రి విశ్వనాథం ప్రశ్న.

“అసలిదంతా మీరిచ్చిన అలుసు కాదూ, ఆడ పిల్లలకు స్వేచ్ఛ కావాలంటూ దాన్నిట్ల తయారు చేసింది మీరే.” తండ్రిపై విరుచుకు పడుతోంది తల్లి పద్మావతి. ఈ అరుపులు, కేకలతో హాల్లోకొచ్చి నిలబడింది విశ్వనాథం తల్లి చెన్నమ్మ. వాళ్ళ మాటల ద్వారా ఆమెకర్థమైన సారంశం: చందుతో మరో నాల్రోజుల్లో జరగాల్సిన పెళ్లిని మనవరాలు వెన్నెల వద్దంటోంది. “ఏమైనాదమ్మా, నువ్వే ఆ పిల్లోడు బాగా నచ్చినాడని వొప్పుకుంటివి గదా, ఇప్పుడేమైనాదని వద్దంటాండవు?” అనునయంగా అడిగిందామె మనవరాలిని. “ఏమో నాకీ పెళ్లి ఇష్టం లేదంతే.” అందరికీ ఒకే సారి సమాధానం చెప్పి విస విసా లోపలికి వెళ్ళి పోయింది వెన్నెల. “ఇప్పుడేం చేస్తారో చెయ్యండి. ఆడ పిల్లని అందరూ నెత్తికెక్కించుకున్నారు కదా!” కాలితో తలుపును ధడేల్మని తోసేసి వీధి లోకి పోయాడు శరత్. పద్మావతి వంటింట్లో దూరి తన కోపాన్నంతా పాత్రల మీద చూపుతోంది. ఏం చేయాలో తోచక కుర్చీలో కూలబడి పోయాడు విశ్వనాథం.

వెన్నెలను స్వతంత్ర భావాలున్న వ్యక్తిగా తీర్చిదిద్దింది తనే. బి. టెక్. పూర్తి చేసాక బహుళ జాతి కంపెనీల్లో ఉద్యోగం వచ్చినా కాదని, ఎం.టెక్. చదివి అనంతపురం లోనే జె.ఎన్.టి.యు. లో టీచింగ్ అసిస్టెంట్ గా చేరింది. పెళ్లి ప్రయత్నాలు మొదలు పెట్టగానే ఖచ్చితంగా తన అభిప్రాయం చెప్పింది. ఏ పట్టింపులూ లేని, కట్న కానుకల ప్రసక్తి లేని; ఇక్కడే పనిచేసే వ్యక్తినే పెళ్లి చేసుకుంటానని, మహా నగరాల్లో లేదా విదేశాల్లో డాలర్లనార్జించే సాఫ్ట్వేర్ ఇంజనీర్లు వద్దని తేల్చి చెప్పింది. తన భావ జాల వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న కూతురు అభిప్రాయాలకు గర్వ పడుతూ, తన పరిచయాల్లో బోధనా వృత్తి లోనో, బ్యాంకు లోనో, ఇతర స్థానిక ఉద్యోగాల్లో ఎవరైనా ఉన్నారేమోనని వాకబు చేయగా, పెద్ద కష్ట పడ కుండానే తెలిసిన మిత్రుల ద్వారా ఆంధ్రా బ్యాంకు లో పని చేస్తున్న చందు సంబంధం వచ్చింది. అన్ని ఫార్మాలిటీస్ పూర్తయి, చందుతో వ్యక్తి గతంగా మాట్లాడాక, తన అభిప్రాయాలకు తగిన వ్యక్తేనని ‘ఓకే’ చెప్పింది వెన్నెల. నెల రోజుల క్రితం నిరాడంబరంగా నిశ్చితార్థం జరిపి, ముహూర్తాలు పెట్టుకున్నారు. వెన్నెల, చందు అప్పుడప్పుడు ఇంట్లో, బయట కలసి మాట్లాడుతున్నా, ఇద్దరి మధ్య అవగాహన పెరుగుతుంది కదా అని ఎవరూ అభ్యంతర పెట్ట లేదు. “అలాంటిది ఇప్పుడు కొత్తగా అతని గురించి వెన్నెలకేం తెలిసిందని పెళ్లి వద్దంటున్నది?” విశ్వనాథం తల పట్టుక్కూర్చున్నాడు. చెన్నమ్మ మెల్లగా కొడుకు దగ్గరి కొచ్చి భుజం మీద చెయ్యేసింది. “నువ్వేమీ దిగులు పడాకు విశ్వా, పాపతో నేను మాట్లాడి, సంగతేందో కనుక్కుంటాలే.” విశ్వనాథం తలూపాడు మౌనంగా.

******************

ఆ రోజు రాత్రి భోజనాలు కానిచ్చారనిపించి, ఎవరి పడకలకు వారు చేరారు. పడుకున్నరనేగాని ఎవరికీ నిద్ర పట్టడం లేదు. వెన్నెలకు చిన్నప్పటి నుండి నాయనమ్మతో కలసి పడుకోవడం అలవాటు. చెరో వైపు తిరిగి పడుకున్నారు. చెన్నమ్మ ఆలోచిస్తోంది. చిన్నప్పటి నుంచి వెన్నెల మనస్తత్వం తనకు బాగా తెలుసు. స్వీయ క్రమశిక్షణతో పెరిగింది తను. ముక్కు సూటి మనిషి. తనకు నచ్చిన పని ఎవరు చెప్పినా ఆపదు, తనకు నచ్చక పోతే ఎవరు చేయమన్నా చేయదు. “మనవ రాలు ఈ పెళ్లి వద్దని అంటున్నాదంటే ఏదో పెద్ద కారణమే వుండి వుంటాది.” అనుకుని మెల్లగా వెన్నెల వైపు తిరిగి, ఆమె పై చెయ్యేసింది. “ఏమైనాదమ్మా ఎన్నెలా, నువ్వా పిల్లోనితో మాట్లాడి, నచ్చినాడని చెప్పినాకనే కదా మూర్తాలు పెట్టించిండేది. ఇప్పుడేంటికి చేసుకోనని అంటాండవు? పిల్లోడు మంచోడు గాదని ఎవరైనా చెప్పినారా, చెడ్డలవాట్లు ఏమన్నా వుండాయా?” వెన్నెల

సమాధానం చెప్పలేదు. “నిన్నేమయినా దుబారుగా మాట్లాడినాడా? చెప్పు తల్లీ, వాల్లకేం చెప్పాల మీ నాయన?” సమాధానం చెప్పించడానికి శత విధాలా ప్రయత్నిస్తోంది చెన్నమ్మ. చివరికి నోరు విప్పింది వెన్నెల. “అదీ... మరీ.....” నసుగుతూనే అసలు కారణం చెప్పింది నాయనమ్మతో. “ఓస్... ఈ మాత్రం దానికి పెండ్లి వద్దంటాండవా తిక్క దానా? నేను ఆ పిల్లోనితో మాట్లాడతాలే, అంతా సర్దుకుంటుంది.” అని మనవరాలిని సముదాయించింది. నిజానికి వెన్నెలకూ ఈ సంబంధం వదులు కోవడం ఇష్టం లేదు. కానీ తనకంటూ కొన్ని నిశ్చితమైన అభిప్రాయాలూ, ఆలోచనలు, అలవాట్లు వున్నాయి. వాటికి భిన్నంగా తను నడచుకో లేదు. వెన్నెలకు చిన్న తనం నుంచి జరిగిన సంఘటనలు గుర్తొస్తున్నాయి.

వెన్నెల పై తండ్రి ప్రభావం చాలా ఎక్కువ. ఆయన క్రమ శిక్షణతో పాటు ఉన్నత భావాలున్న వ్యక్తి. వేకువ జామున ఐదు గంటలకే నిద్ర లేచి, ఉదయపు నడకకు వెళ్ళడంతో దిన చర్య మొదలవుతుంది. ఆ తర్వాత వార్తా పత్రికలు చదవడం, పెరటి మొక్కల పని చూడటం, టిఫిను గట్రా ముగించి ఆఫీసు కెళ్ళడం – సాయంత్రం ఆఫీసు నుంచి నేరుగా ఇంటి కొచ్చి ఏదో ఒక పుస్తకం చదవడం, దాన్ని గురించి చర్చించడం, రాత్రి తొమ్మిదిన్నర కంతా నిద్రకుపక్రమించడం ఆయన అలవాటు. అవే అలవాట్లు వెన్నెలకూ వచ్చాయి. ఆది వారాలూ, సెలవు రోజులూ కూడా చీకటి తోటే నిద్ర లేవడం వెన్నెలకు అలవాటు మాత్రమే కాదు, అత్యంత ఇష్టం కూడా. “ప్రభాత సమయంలో నిశబ్ద సంగీతాన్ని ఆస్వాదించాలి, పక్షుల కిల కిలా రావాలతో సూర్యుణ్ణి స్వాగతించాలి.” అంటుంది మెరిసే కళ్ళతో. “అవును మరి, నువ్వు స్వాగతం చెప్పక పోతే సూర్యుడు వెనక్కి పోతాడు గావాల!” వెక్కిరిస్తాడు శరత్. పరీక్షల రోజుల్లో రాత్రంతా చదివి, తెల్ల వారు జామున నిద్ర పోయి, ఏ తొమ్మిదికో నిద్ర లేస్తాడతను. మిగితా రోజుల్లో కూడా అర్ధ రాత్రి వరకూ సినిమాలు, షికార్లంటూ తిరిగి ఏ నడి రేయో ఇంటికి చేరడం వెన్నెలకు చిరాకు తెప్పించేది. పొద్దున పరీక్ష వుందన్నా సరే రాత్రి పది గంటలకే పడుకునేది తను. మళ్ళీ వేకువ జామున లేచి చదువుకునేది. “పరీక్షలంటే అస్సలు భయం లేదు దీనికి, పది కూడా కాకుండానే దుప్పటి ముసుగు పెడుతుంది!” విసుక్కుంటాడు శరత్. “నా మనవరాలు నీలాగా రాత్రంతా జాగారం చెయ్యక పోయినా ఫస్టు గా పాసయితుంది. ఒక్కసారి చదివినాదంటే ఇట్లే నేర్చుకుంటాది, ఆయ్, ఏమనుకుంటాండవో?” మురిపెంగా వెనకేసుకొస్తుంది చెన్నమ్మ మనవరాలిని. “ ఏ మాట కా మాటే చెప్పు కోవాలి. ఎప్పుడూ కష్టపడి చదివినట్లే కనిపించదు, దీనికిన్ని మార్కులు ఎట్లొస్తాయో?” ఆశ్చర్య పోతుంటాడు శరత్.

ఇంటర్ తర్వాత కాకినాడ జె.ఎన్.టి.యు. లో బి.టెక్. చేరిన వెన్నెలకు హాస్టల్లో రూమ్మేట్లతో మళ్ళీ సమస్య మొదలు. రాత్రంతా సెల్ ఫోన్లో చాటింగులూ, ల్యాప్టాప్ లో బ్రౌజింగులూ చేస్తూ లైట్లు వెలిగించి పెడితే నిద్ర పట్టక అవస్థ పడేది తను. తన అలవాటు ప్రకారం వేకువ ఝామున లేచి చదువు కోవాలని లైటు వేస్తే ఆపేయమని గొడవ చేసే వాళ్ళు. ఎలాగోలా బి.టెక్. పూర్తి చేసాక, ఈ సరి ఎం.టెక్. కోసం హైదరాబాదు జె.ఎన్.టి.యు. లో చేరాల్సి వచ్చింది. పోనీలే, ఇక్కడ అమ్మాయిలు కాస్త పెద్దవాళ్ళు, మెచ్యూరిటీ వున్న వాళ్ళు, అర్థం చేసుకుంటారు.” అనుకుంది. కానీ ఆమె ఆశ అడియాసే అయింది. మహా నగరాల్లో నాగరికత వెర్రి తలలు వేసి, ఈ అమ్మాయిలు రాత్రిళ్ళు పార్టీలూ, పబ్బులంటూ తిరిగి క్యాలెండర్లో తేదీ మారాక హాస్టల్ కు చేరే వాళ్ళు. వెన్నెలకు భరించ లేనంత అసహనం. “వీళ్ళంతా నిశా చరులు. రాత్రిళ్ళు సంచారాలు చేసి, పగలు నిద్రావస్థలో జోగుతుంటారు. ఈ స్తబ్ద జీవులతో సమాజమే స్తబ్దంగా మారి పోతుందా?” ఇలా చిరాకు పడుతూనే చదువు పూర్తి చేసింది. తను సాఫ్ట్వేర్ ఉద్యోగం వద్దనుకోవడానికి ఇదీ ఓ కారణమే. అమెరికా కంపెనీల కోసం పని చేసే ఈ సాఫ్ట్వేర్ ఇంజనీర్లు మనకు రాత్రయితే అక్కడ పగలు కాబట్టి, వాళ్ళ కోసం రాత్రిళ్ళు పని చేయడం తనకు తెలుసు. “ఆ సంపాదనా వద్దు, రాత్రిళ్ళు జాగారాలు చేసే ఆ ఉద్యోగాలూ

వద్దు." అనేది స్పష్టంగా. అందుకే అలాంటి ఆలోచన లేని చందును పెళ్లి చేసుకోవడానికి వొప్పుకుంది. కానీ రెండు రోజుల క్రితం వాళ్ళ మధ్య జరిగిన సంభాషణ వల్ల వెన్నెల పునరాలోచనలో పడి నిర్ణయం మార్చుకుంది. "తన నిర్ణయం తప్పా?" ఆలోచిస్తూనే నిద్ర లోకి జారుకుంది.

మరు దినం ఉదయం వెన్నెల కాలేజికి వెళ్ళగానే, చెన్నమ్మ కొడుకుతో చందు ఫోన్ నెంబర్ తీసుకొని, అతనితో మాట్లాడింది. "బాబూ, ఏమనుకోక పోతే ఒక సారి ఇంటి కొస్తావా, నీతో మాట్లాడాల." చందు ఆశ్చర్య పోయాడు. "ఎప్పుడూ లేనిది ఈ పెద్దావిడ నాకు ఫోన్ చేసి రమ్మంటున్నదేమిటి? ఏం జరిగుంటుందబ్బా?" అని మనసులో అనుకుంటూనే, "సరేలే అవ్వా! మధ్యాహ్నం భోజనం సమయంలో వస్తాను." అని ఫోన్ పెట్టేశాడు. అన్నట్లు గానే మధ్యాహ్నం వాళ్ళ ఇంటి కెళ్ళాడు. వాకిట్లోనే ఎదురైన చెన్నమ్మ "రా బాబూ, భోంచేసావా?" అంటూ లోపలి తీసుకెళ్ళి వెన్నెల చెప్పిన విషయం చెప్పింది మెల్లగా. చందూ మొదట ఆశ్చర్య పోయి ఆ తరువాత పెద్దగా నవ్వేశాడు. "ఓస్ ఇదా విషయం, మొన్నటి నుంచి వెన్నెల నాతో ముభావంగా వుంది. మీరేమీ భయ పడకండి, నేను వెన్నెలతో మాట్లాడు తాను." అని అభయ మిచ్చి వెళ్లి పోయాడు.

*********************

మధ్యాహ్నం మూడు గంటలకు కాలేజిలో వున్న వెన్నెల సెల్ ఫోన్ మోగింది. చూస్తే చందు. "నేను మీతో మాట్లాడాలి. సాయంత్రం కాలేజి నుంచి వచ్చేటపుడు సప్త గిరి సర్కిల్ దగ్గర బస్ దిగండి. నేనొచ్చి కలుస్తాను." అంటూ వెన్నెలకు మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా ఫోన్ పెట్టేశాడు. వెన్నెల ఆలోచనలో పడింది. "నాయనమ్మ అప్పుడే అతనితో మాట్లాడినట్లుంది. తను అతణ్ణి హర్ట్ చేసిందా?" మొదటి సారిగా వెన్నెలకు గిల్టీగా అనిపించింది. పెళ్లి విషయంలో తను పునరాలోచనలో పడటానికి దారి తీసిన సందర్భం గుర్తొచ్చింది. బస్సెక్కి కూర్చోగానే మనసు నాలుగు రోజులు వెనక్కి వెళ్ళింది.

**************************

ఆ రోజు ఉదయం 7 గంటలకు వెన్నెల చందుకు ఫోన్ చేసింది. ఎన్ని సార్లు చేసినా అవతల్నుంచి స్పందన లేదు. "ఏమై వుంటుందా?" అని కాస్త కంగారు పడింది కూడా. ఆ తర్వాత కలిసిన చందు అసలు విషయం చెప్పాడు. "రాత్రి సెకండ్ షో సినిమా కెళ్లాను. ఈ మధ్య రోజూ సెకండ్ షో చూసి పడుకోవడం అలవాటయింది. రోజూ త్వర గానే లేచే వాణ్ని. ఈ రోజెందుకో లేవ లేక పోయాను." సంజాయిషీ ఇచ్చుకున్నాడు. వెన్నెలకు మతి పోయింది. "రోజూ సెకండ్ షోనా?!" "అవును దాదాపు ఊళ్ళో వుండే కొత్త సినిమాలన్నీ చూసేసాను." కళ్ళు ఎగరేస్తూ చెప్పాడు చందు. వెన్నెల ఉసూరుమంది. ఇంటికి చేరిందే గానీ, బాగా డీలా పడి పోయింది. "త్వరగా నిద్ర పోవడం, త్వరగా నిద్ర లేవడం ఒక మంచి అలవాటు మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా చాలా మంచిది." అంటుంటారు నాన్న. ఇప్పుడు ఆహారం, అలవాట్లు, అభిరుచులు ఒకటేమిటి – అన్నీ మారి పోతున్నాయి. మనది అనుకున్న

సంస్కృతి క్రమంగా అదృశ్యమై పోతున్నది. అర్ధ రాత్రి దాకా టీవీ చూస్తూనో, పార్టీలు, పని కోసం జాగారం చేయడం, పగలేమో స్తబ్ద జీవుల్లాగా నిద్రావస్థలో మునిగి పోవడం, ఈ నిశా చరులతో లోకమంతా నిశితో నిండి పోతుందా? "మళ్ళీ తనకు నిశాచర సహవాసం తప్పదా? అమ్మో... జీవితాంతం ఇలాగా......? ఎందుకు తప్పదు, ఏదయితే అది కాని." అని పెళ్లి చేసు కోనని కరా ఖండిగా చెప్పేసింది. దాంతో ఇంట్లో అగ్ని పర్వతం బద్దలైనట్లయింది.

****************************

"ఇక ఇప్పుడేం జరగనుందో?" అనుకుంటూ ఉండగానే బస్సు సప్త గిరి సర్కిల్ చేరింది. చందు బస్సు దగ్గరికి రావడంతో బస్సు దిగింది.

రండి, అలా శ్రీ సాగర్ లోకి వెళ్దామా?" అంటూనే దారి తీశాడు. నడవక తప్ప లేదు వెన్నెలకు. సెలవు రోజు కాక పోవడం వల్ల జనం పలుచ గానే వున్నారు. ఓ మూల టేబుల్ దగ్గర కూచున్నా రిద్దరూ. ఐస్ క్రీం ఆర్డర్ చేసి సర్వర్ వెళ్ళగానే నేరుగా విషయం లోకి వచ్చేశాడు చందు. "మీకేమైనా అనుమానాలుంటే నేరుగా నన్నే అడగొచ్చు కదండీ. అయినా అన్ని విషయాల్లో అంత విశ్లేషించే వారు ఈ సమస్యను పరిష్కరించ లేక పోయారా?" సూటిగా ఆమెనే చూస్తూ అడిగాడు. "అది కాదండీ, మరీ నేను... నాకు...." వెన్నెల మాటలను మధ్య లోనే అడ్డుకున్నాడు చందు.

"అవును, మీకు నిశాచారులంటే గిట్టదు. నేను కూడా సెకండ్ షో సినిమాలు చూస్తున్నాను కాబట్టి, నిశాచర జీవినేనని భయ పడి, ఈ నిశా చరుడితో జీవితాంతం వేగ లేనని నాతో పెళ్లి వద్దన్నారు. అంతేనా?" చందు ముఖానే అడిగేసరికి వెన్నెల మౌనంగా తలొంచుకుంది. "నేను మీతో ఏం మాట్లాడానో ఒక సారి గుర్తు చేసుకోండి. 'ఈ మధ్య సెకండ్ షోలు చూడటం అలవాటయింది' అన్నాను, అంతే కదా! అంటే నాకు మొదటి నుంచి అలవాటు లేదనేగా? మీకు అసలు కారణం చెప్పనా? మా నాన్న టీచరు గా పని చేస్తూ మమ్మల్ని చదివించడానికే సరి పోయింది. ఇల్లు కట్టు కోవడానికి కుదర లేదు. పెద్ద ఇల్లు తీసుకోవడానికి బాడుగలు పెట్ట లేక చిన్న దాంట్లోనే సర్దు కోవాల్సి వస్తోంది. మా అన్నది కూడా అంతంత మాత్రం సంపాదనే. నాకు ఈ మధ్యనే కదా ఉద్యోగం వచ్చింది. మూన్నెళ్ళ క్రితమే మా చెల్లెలి పెళ్లయింది. వారం రోజుల్నుంచి వాళ్ళు మా ఇంట్లోనే వున్నారు. అసలే మూడు గదుల చిన్న ఇల్లు. ఓ గదిలో అన్నా వదిన వుంటారు.

వంట గదిలో అమ్మా నాన్నలు సర్దుకోవడానికే చాలదు. ఇక మిగిలిన గదిలో కొత్తగా పెళ్ళయిన మా చెల్లి వాళ్ళుంటారు. ఆరూ బయట పడుకుందామంటే చలి. ఏం చేయాలో తోచక సినిమాల కెళ్ళడం అలవాటు చేసుకున్నా. ఆ సినిమా హాల్లో కూడా సగం నిద్ర పోవడమే. అంతేకాని నేనేం నిశా చరుణ్ణి కాదండీ బాబూ. మీ అంత కాకపోయినా, కాస్తో కూస్తో క్రమ శిక్షణ గల వాడినే." సర్వర్ రాకతో చందు ఆగాడు. వెన్నల తన ఆలోచనలకు, ప్రవర్తనకు సిగ్గు పడింది. "నిజమే, తనే నేరుగా మాట్లాడి వుండాల్సింది. ఇంట్లో

అందరినీ బాధ పెట్టేశాను." స్వగతంలో అనుకుంది. "ఐస్ క్రీం తీసుకోండి మేడం!" చందు మాటలతో ఈ లోకంలో కొచ్చింది. "అయినా, ఇంత అందమైన వెన్నెలను ఎదురుగా పెట్టుకొని ఏ వెధవన్నా సెకండ్ షో లంటూ థియేటర్ల వెంబడి తిరుగుతాడా చెప్పండి?" వెన్నెలనే చూస్తూ చిలిపిగా అన్నాడు చందు. మబ్బు చాటు నుండి బయటి కొచ్చిన జాబిలి జాలు వార్చిన వెన్నెల్లా నిండుగా నవ్వింది వెన్నెల.




ఈ మధ్యన మా ఇంటికి ఒక బంధువు వచ్చాడు. మాటల మధ్యలో `నేటి పిల్లలు - అమెరికా ఆశలు`అనే విషయాన్ని గురించి మాటలాడటం మొదలెట్టాడు. నేను మౌనంగా ఉండి వింటూ ఉండటంతో నాకా విషయంలో అనుభవ లేమిని గ్రహించినట్లుగా, ఆ విషయంలో నాకున్న అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానోదయం కలిగించి తీరాలన్న పట్టుదల అతని మాటల్లో కనిపించింది.

అమెరికా వెళ్లి స్థిరపడటం అనేది నేటి పిల్లల అభివృద్ధికి చిహ్నమట. కొంత మంది తల్లి తండ్రులు ఆ అభివృద్ధిని చూసి సహించ లేక పోతున్నారట. అందుకే అమెరికా వెళ్లి స్థిర పడిన తమ పిల్లల్ని నిందిస్తున్నారట. అలాంటి తల్లి తండ్రులను క్షమించ కూడదట.

అలాంటి వాళ్ళు పక్షులను, జంతువులను చూసి నేర్చు కోవాలన్నాడు. అవేం చేస్తాయి? అని నా వైపు చూస్తూ అడిగాడు. నువ్వే చెప్పు అన్నట్లు అతని వైపు నేను చూసాను. ఇలా ఏదో చెపుతూ మధ్యలో నన్ను ప్రశ్నలు వేసే వాళ్ళంటే నాకు చాలా కోపం. కాని అతను ఇంటికి వచ్చిన అతిధి అవటం వలన, ఏమి అన లేక ఊరుకోవాల్సి వచ్చింది.

కొంత వరకే పిల్లల్ని చూస్తాయట. తర్వాత వాటి మానాన వాటిని బ్రతక మని వదిలేస్తాయట. మళ్ళీ ఆ పిల్లల వైపైనా చూడవట. మరో రకం పక్షులైతే ఈ విషయంలో ఇంకా ముందు ఉన్నాయని, అవి ఆకాశంలో ఉండగా గ్రుడ్లను పెట్టి, అలా వదిలేస్తాయని, అవి భూమి మీదకు పడే లోపుగా పగిలి, వాటి నుండి పిల్లలు బయటకు వచ్చి ఆ గాలి లోనే రెక్కలు మొలిచి, ఎగరటం నేర్చుకొని భూమి మీదకు చేరే సరికి ఎగరటం వాటికి వచ్చేస్తుందని అన్నాడు. ఆ తరువాత వాటికి ఆ పిల్లలకు ఏ సంబంధమూ ఉండదట.

అది సృష్టి రహస్యం అట, ఒక్క మనకే ఇంకా అది అర్ధమవటం లేదట. ఇలా సాగింది అతని వాక్ప్రవాహం చాలా సేపు.

అతనికి ఇద్దరు పిల్లలు, వాళ్లింకా చిన్న వాళ్ళు. అందు వల్ల అతను ప్రస్తుతం కులాసా గానే కబుర్లు చెబుతున్నాడు. అతని అజ్ఞానానికి నాలో నేను జాలి పడటం తప్ప మరేమీ చేయ కూడదని నిర్ణయించుకొని, అతను చెప్పిన వాటన్నిటికి `ఊ` కొట్టి అతను వెళ్ళేవరకు ఓపిక పట్టేను.

అతను వెళ్ళేక లోపలకి వచ్చి “శాంతా! కాఫీ ఇస్తావా?” అని అడిగే సరికి నా భార్య శాంత “ఆయన ఏమంటున్నాడు?” అంటూ నన్ను అడిగింది. నేను జవాబు చెప్పే లోపల లోపలి వెళ్లి కాఫీ కప్పుతో వచ్చింది.

“పిల్లలు అమెరికా వెళ్ళి పోవటం గురించి మన దేశం లోని తల్లి తండ్రులు అపార్ధం చేసుకుంటున్నారని, అది తల్లి తండ్రుల స్వార్ధానికి నిదర్శనమని అంటున్నాడు.” అన్నాను.

“మరి మీ ఉద్దేశ్యం ఏమిటని చెప్పారు?”అంది వదిలి పెట్టకుండా.

“మన పిల్లలూ ఉన్నారుగా, రేపు వాళ్లకి కూడా అమెరికా వెళ్ళే అవకాశాలు వస్తాయి, మరి వాళ్ళు కూడా అలానే వెళ్ళి పోతే మీరేమంటారు?” అంది.

నా ఉద్దేశ్యం ఏమిటో ఆమెకు తెలియదని కాదు, ఐనా మళ్ళీ మళ్ళీ అలా అప్పుడప్పుడు అడుగుతూనే ఉంటుంది. నేను నా సమాధానాన్ని ఎప్పుడూ ఒకేలా చెబుతూనే ఉంటాను.

ఈ లోపున పక్కింటావిడ నా భార్యతో కొంచం సేపు కబుర్లు చెప్పుకోవటాని కని రావటంతో, నేను నా గది లోకి వెళ్లి పోయాను. ఐనప్పటికీ వాళ్ళాడుకొనే మాటలు నాకు స్పష్టం గానే వినపడుతున్నాయి. తెలిసినవే ఐనా మళ్ళీ అలా వింటూ కూర్చున్నాను.

వాళ్ళకి ఇద్దరు అబ్బాయిలు. ఇద్దరూ అమెరికా లోనే స్థిర పడ్డారు. ఎప్పుడయినా వీలు పడినప్పుడు వచ్చి, వాళ్ళ అత్త గారి ఇంటిలో మూడొంతుల రోజులు గడిపి, వీళ్ళ దగ్గర ఒక వంతు రోజులు గడిపి వెళ్లి పోతుంటారు. అలా వాళ్ళు వచ్చి వెళ్ళిన ప్రతి సారీ ఆవిడ పాపం మా ఇంటికి వచ్చి నా భార్యతో తన బాధను చెప్పుకొంటూ ఉంటుంది.

“ఏమిటోనండీ, అప్పుడే పిల్లలు రావటం, వెళ్ళటం అంతా కలలోలా జరిగి పోయాయి. అంత వరకూ పిల్లల కోసం చూసిన ఎదురు చూపులు, వాళ్ళ రాక కోసం పడే ఆత్రుత మనసును స్థిరంగా ఉండ నివ్వవు. తీరా పిల్లలు వచ్చి వెళ్లే సరికి మనసు ఉస్సూరంటుంది. ఈ కొంతేనా వీళ్ళతో ఉండే అనుబంధం అని అన్పిస్తూ ఉంటుంది. మళ్ళీ ఎప్పుడు వస్తారో అని ఎదురు చూపుల తోనే గడపాలి. జీవితంలో మూడొంతులు ఎదురు చూపుల తోనే గడిచి పోతోంది మాకు. ఇంత కంటే ఏమీ చేయ లేము కదా! ” ఆ మాటలు అంటున్న పుడు ఆవిడ కళ్ళలో నీళ్ళు నిండేయి.

“అమ్మా! అన్నం పెట్టావా? అనే పిలుపు లోని మాధుర్యాన్ని కోడళ్ళు వచ్చిన వెంటనే లాగేసుకుంటారు. అంత వరకూ తల్లి ఒడిలో తల పెట్టు కొని మరీ తన సమస్యలను, సంతోషాలను తల్లితో పంచుకొనే కొడుకు అక్కడ నుండి వాటిని తన భార్యతో పంచుకోవటం మొదలెడతాడు.”

“ఆ మార్పు కొడుకుపై ఏమీ ప్రభావం చూపదేమో కాని, ఆ తల్లి మనసుపై మాత్రం చాలా ప్రభావాన్ని చూపుతుంది. కానీ ఆకొడుకు అది గ్రహించ లేడు. ఆ స్థితికి కారణం కోడలే కనుక, కోడలిని ఏమైనా అందామా అంటే ఆ అవకాశాన్ని ఇప్పటి కోడళ్ళు ఎక్కడ ఇస్తున్నారు? పెళ్ళైన మరుచటి రోజు నుండే మొగుణ్ణి కొంగు కేసి కట్టేసుకుంటున్నారు. “ఆవిడ మాటల్లో బాధ, ఉక్రోషం, పొంగి పొరలుతున్నాయి.

నా భార్య అలా వింటోంది మౌనంగా.

“ఇవన్నీ ఒక అమ్మగా కొడుకుల విషయంలో నా అనుభవాలు. అందరి విషయంలో ఇలాగే జరుగుతుందని నేను అనటం లేదు . కానీ, చాలా మంది విషయంలో మాత్రం ఇలాగే జరుగుతూ ఉంటుందని ఖచ్చితంగా చెప్ప గలను. పోనీ అతనితో చెప్పు కొని కొంచం ఓదార్పు పొందుదామంటే నాదీ, అతనిదీ ఒకే రకం బాధాయే! నా కంటే ఆయన మనసు సున్నితం. ఇంక ఆయనతో నేనేం చెప్పుకొనూ ? ఎలా ఓదార్పు పొంద గలను? మీరే చెప్పండి!” చెప్పటం ఆపి ఒక్క క్షణం నిశ్శబ్దంగా ఉంది. ఆవిడ కళ్ళ నుండి నీళ్ళు తిరుగుతుంటే చీర చెంగుతో

తుడుచు కొంటూ కొంచెం సేపు ఆగింది. ఆ మౌనం చాలా ఇబ్బంది కరంగా ఉంది.

ఆవిడ మాటలన్నీ నాకు స్పష్టం గానే వినబడుతున్నాయి. నాకు కూడా చాలా బాధ అనిపించింది.

“చిన్నప్పుడు కొంగు పట్టుకొని వదలని కొడుకు ఇలా ఎలా అమ్మను విడిచి, అమ్మను మరచి, అమ్మకు వెరచి బ్రతక గలుస్తూన్నాడు? అమ్మ పై జాలి, కరుణ, ప్రేమ, దయ, ఏమీ లేకుండా ఎలా ఉండగలుస్తున్నాడు?” ఆవిడ ఈ మాటలు అని మళ్ళీ ఒక క్షణం ఆగింది.

అవే ప్రశ్నలు నన్ను నేనే వేసుకున్నాను. నాకు సమాధానం దొరక లేదు. కానీ నా ఆలోచనలు ఇంకా సాగుతూనే ఉన్నాయి.

“నాకు తెలిసి తన దగ్గరే ఉండి పోమ్మని, ఏ అమ్మా, ఏ కొడుకునూ, ఎప్పుడూ అనదు. ఎవ్వరూ అలా కోరుకోరు. కానీ అసలు తన ధ్యాసే లేనట్లు, తన ఆలోచనే లేనట్లు ఆ కొడుకు ప్రవర్తిస్తూ ఉంటే, ఏ తల్లయిన ఎలా భరించ గలదు, ఎలా సహించగలదు? ఎలా జీవించ గలదు?” ఈ మాటలని మళ్ళీ ఆవిడ ఆగింది.

నా ఆలోచనలు కూడా అలా ఎడ తెరిపి లేకుండా అమ్మ మనసు పడే బాధ చుట్టూనే తిరుగు తున్నాయి. నా మనసును నేనే ప్రశ్నించుకోవటం మొదలెట్టాను.

“దీనికి పరిష్కార మార్గం ఏమీ లేదా? ప్రతి తల్లీ ఇలా ఎప్పటికీ బాధ పడవలసిందేనా?”

“అమ్మ కనుక ఇలా ఎవరి దగ్గరైనా బయట పడి తన బాధ చెప్పుకుంటుంది. మరి తండ్రి సంగతేమిటి? తను మాత్రం తన పిల్లలను ఎంతగా ప్రేమిస్తాడు! వాళ్ల కోసం ఎన్ని బాధలు పడతాడు! వాళ్ళ బావి కోసం ఎన్ని కలలు కంటాడు! మరి అలాంటప్పుడు అతని మనసెంత బాధకు లోనవుతూ ఉంటుంది? కానీ ఆ బాధను అతనెవరితో చెప్పుకో గలడు?”

“తల్లి తండ్రుల తమ వల్ల పడే ఈ బాధలను కొడుకులు ఎందుకు గ్రహించరు? కొంతైనా ఆత్మీయతను ఎందుకు ప్రదర్శించరు? రేపు వాళ్ళకు పిల్లలు పుట్టారా? ఆ పిల్లలూ ఇలాగే ప్రవర్తించరా? అప్పుడు వీళ్ళు కూడా తల్లి తండ్రుల లాగే బాధ పడాల్సి రాదా?”

“మరి ఈ ఆలోచన వాళ్ళకెందుదు రావటం లేదు?”

ఇలా ఆలోచిస్తూ ఉండగానే అనుకోకుండా నా కళ్ళ నుండికూడా కొన్ని నిటి చుక్కలు రాలి పడ్డాయి. ఈ సమస్యకు పరిష్కారమే లేదా అని అనుకుంటూ కళ్ళను తుడుచుకున్నాను.

“ఏం చేస్తున్నారు?”అంటూ వచ్చిన శాంతమాటలో ఈ లోకంలోకి వచ్చేను. ఆమె నావాలకం గ్రహించి ,” మీరేమి అనవసరంగా ఎక్కువగా ఆలోచించి బాధ పడకండి, మన పిల్లలు మనసోదిలి అలా వెళ్ళరు, సరేనా?” అంటూ ఉంటే నాకు నవ్వు వచ్చింది. అది ఎందుకో నాకే తెలియ లేదు. కానీ, మీకేమైనా అర్థం అయితే నాకు చెప్పండి.




ఈ రోజు ఆదివారం. బయట వాతావరణం చాలా ఆహ్లాదం గా ఉంది. చల్లగాలిలో కూడిన వర్షం పడుతుంది. అలాంటి ఆహ్లాదకరమైన

వాతావరణం లో కూడా మనసెంతో దిగులుగా ఉంది. మామూలుగా అయితే, ఇలాంటి వెదర్ లో, కిటికీ లో నుంచి బయటకి చూస్తూ, ఎంత సేపైనా తెలికుండా గడిపేయవచ్చు. కానీ ఆ రోజు అదే కిటికీ పక్కన కూర్చుని బయటకి చూస్తుంటే, మనసంతా చెప్పలేని దిగులు. దానికీ కారణం ఉంది. ఎదురింట్లో ఒక ముచ్చటైన కుటుంబం కాపురం ఉంటుంది.

ఆ అమ్మాయి పేరు శ్వేత. గృహిణి. ఎప్పుడైనా బయట కనిపించినప్పుడు నవ్వుతూ ఎలా ఉన్నారు? ఉద్యోగం ఎలా ఉంది? తిన్నారా అని అభిమానంగా అడుగుతుంది. ఒకటి, రెండు సార్లు ఇంటికి పిలిచింది. నేను ఎప్పుడూ వెళ్ళలేదు. నాకెందుకో, తనంటే తెలిని అభిమానం. బహుశా, నా పర్సనల్ విషయాలు ఎప్పుడూ అడగదని కాబోలు. వాళ్ళ అయన ఏదో కంపెనీ లో సేల్స్ మేనేజర్. వాళ్ళకి ఒక పాప. చాలా ముద్దు గా ఉంటుంది. ముచ్చటగా ఉండే కుటుంబం అది. మూడు నెలల క్రితం,

ఇలాంటి ఒక ఆదివారం రోజునే శ్వేత వాళ్ళ ఆయన యాక్సిడెంట్ లో పోయారు. అతి తక్కువ పరిచయం ఉన్న నా వల్లే కావటం లేదు ఆ విషయాన్ని జీర్ణించుకోవటం. శ్వేత పరిస్థితి ఎలా ఉండి ఉంటుందో? ఊహించలేకుండా ఉన్నాను. ఒకసారి వెళ్ళి పలకరిద్దామన్నా నాకు ధైర్యం సరిపోవటం లేదు. చనిపోయిన వాళ్ళ ఇంటికి వెళ్ళి, వాళ్ళ సొంత వాళ్ళని పలకరించి, సానుభూతి కబుర్లు చెప్పటం వల్ల బాధ ఎక్కువ అవుతుంది కానీ, తగ్గుతుందా? ఇలాంటి ఫార్మాలిటీస్ ఎవరు పెట్టారో, ఎలాంటి ఉద్దేశ్యం తో పెట్టారో కాని, నాకైతే శ్వేత ని పలకరించాలంటే, చాలా భయం గా ఉంది. భగవంతుడు ఎందుకు మంచివాళ్ళని అలాంటి విషమ పరీక్షలకి గురి చేస్తాడో? ఏంటో..?

ఆ విషాదం జరిగి అప్పుడే మూడు నెలలు గడిచిపోయింది. ఎవరి రొటీన్ లో వాళ్ళు పడిపోయారు. ఫస్ట్ ఫ్లోర్ లో ఉన్న మా కిటికీలో నుంచి చూస్తుంటే, శ్వేత వాళ్ళ గుమ్మం కనిపిస్తుంది. తలుపు దగ్గరగా వేసి ఉంది. ఇంట్లో బంధువులు ఎవరూ ఉన్నట్టు లేరు. తనని అలాంటి పరిస్తితుల్లో వదిలి అప్పుడే అందరూ వెళ్ళి పోయరా? ఎవరి బిజి లైఫ్ వాళ్ళది కదా! ఎవర్ని తప్పు పట్టగలం? ఆ ఇంటికేసి చూస్తుంటే చాలా అన్యమనస్కంగా ఉంది.

శ్వేత ఆలోచనల్లో ఉన్న నేను ఎవరో తలుపు కొట్టిన శబ్దం రావడం తో ఈ లోకం లోకి వచ్చాను. లేచి వెళ్ళి తలుపు తీసి చూస్తే, కిందింటి కా మాక్షమ్మ గారు. నేను ఆ ఇంట్లో కి అద్దెకి వచ్చి అయిదు నెలలు అవుతుంది. నేను వచ్చే రెండు నెలల ముందు వాళ్ళు కింద పోర్షన్ లోకి దిగారట. ఆవిడ కట్టు, బొట్టు చూడటానికి మహాలక్ష్మి లాగా ఉంటుంది. కానీ ఆవిడ మనసు మాత్రం అంత గొప్పది కాదు అని పరిచయమైన కొత్తలోనే అర్ధమైంది.

ప్రతి ఆదివారం వచ్చి కొంచెం సేపు కూర్చుని, నా స్వవిషయాల గురుంచి ఆరా తీయటం ఆవిడకి సరదా. అలా అడగటం లో, ఆవిడకి నా మీద అభిమానం ఉన్నట్టు ఎప్పుడూ కనిపించదు. ఆ ఇంట్లో ఒక్కదాన్నే ఉంటున్న నాలో ఏదన్నా లోపాలు వెతికి పట్టుకోవాలన్న ఆరాటం తప్ప. ఈ రోజు మాత్రం ఆవిడ శ్వేత గురుంచి చెప్పటానికి వచ్చిందని కొంచెం సేపటికే అర్ధమైంది. శ్వేత కి

మావగారు లేరట. అత్తగారు మాత్రం ఉన్నారట. ఆవిడే పెద్ద కొడుకు మీద ఆధారపడింది కాబట్టి, ఇక వీళ్ళ బాధ్యత కూడా తీసుకోటానికి అత్తింటి తరుపున ఎవరూ లేరు. తల్లితండ్రులు లేని శ్వేతకి, ఉన్న ఒక అన్నయ్య కూడా భార్య నోటికి జడిసి, చెల్లిని పుట్టింటికి తీసుకెళ్ళాలనే ఆలోచనకి దూరం గానే ఉన్నాడట. ఇది ఆవిడ శ్వేత గురించి సేకరించిన సమాచారం.

మళ్ళీ ఆదివారం నన్ను పలకరించటానికి వచ్చిన కామక్షమ్మ గారు ఈ సారి శ్వేత గురించి ఇంకో విషయం చెప్పింది. భర్త చనిపోయాక, శ్వేత చెడు తిరుగుళ్ళు మొదలెట్టిందని, అలా సంపాదించిన డబ్బులోనే, ఇల్లు నడుపుతుంది అని దాని సారాంశం. ఆవిడ విషయం తెలిసిన నేను ఇది విని పెద్దగా ఆశ్చర్యపోలేదు కానీ, ఈ సారి మాత్రం విని ప్రశాంతంగా ఉండలేకపోయాను.

కామాక్షమ్మ గారూ! పని, పాట లేనివాళ్ళు ఇలాంటివి ఎన్నో మాట్లాడుతూ ఉంటారు. మీలాంటి మంచివారు, తెలివైన వారు కూడా ఇలాంటి వాటిని నమ్మటమే కాకుండా ఇంకొకరికి చెప్పటం నాకు బాధగా ఉందండి. ఇన్ని రోజులనుంచి చూస్తున్నాం కదా! శ్వేత ఎలాంటిదో మనకి తెలీదా? ఇలాంటివన్నీ చెప్పిన వాళ్ళని అప్పుడే చెప్పు తీసుకుని కొట్టాలండి. ఎందుకంటే, ఇలాంటివాళ్ళు మనగురించి కూడా వేరేవాళ్ళకి ఇలాంటివే చెప్తారు. ఇంకా నా దగ్గర శ్వేత గురుంచి చెడుగా మాట్లాడితే ఆ కొట్టే చెప్పు నాది, కొట్టించుకునే చెంప నీదే అవుతుంది అన్నంత ఆవేశంగా మాట్లాడాను. ఈ మాట ఆవిడ మీద మంచి ప్రభావాన్నే చూపించి ఉండాలి మరి. అలా జరిగితే ఇంకొకరికి ఈ వార్త ఈవిడ ద్వారా వ్యాపించకుండా ఆపిన దాన్ని అవుతాను. కానీ ఎప్పటి నుంచో, ఇలాంటి పుకార్ల గురుంచి మాట్లాడుకుని టైంపాస్ చేసే వాళ్ళు మారతారని నేను అనుకోను.

ఏది ఏమైనా, ఈ రోజు శ్వేత దగ్గరికి వెళ్ళాలనే నిర్ణయించుకున్నాను. భోజనం చేసాక, పాపకి చాకలెట్ బాక్స్ తీసుకుని వెళ్ళాను. నన్ను చూడగానే నవ్వుతూ లోపలకి పిలిచింది. కానీ, ఇంతకుముందులా ఆ నవ్వులో జీవం లేదు. జరిగిపోయిన విషయం గురుంచి మాట్లాడి తనని బాదపెట్టే ఉద్దేశం నాకు లేదు. అందుకే నేను అక్కడకి వెళ్ళిన విషయం గురించే మాట్లాడాను. శ్వేత గారూ! భగవంతుణ్ణి నమ్మే నేను ఎలాంటి కష్టం వచ్చినా, ఇష్టం గానే భరించాలి అంటాను. ఎందుకంటే, అది ఎంత పెద్ద కష్టమైనా, దేవుడు ప్రేమగా ఇచ్చిందే కదా! మీరు డిగ్రీ చదివారు అని నాకు తెలిసింది. మీకు ఉద్యోగ అవసరం ఉంది అనే నేను అనుకుంటున్నాను. ఎందుకంటే, మీ ఆర్థిక పరిస్థితి ఏంటో నాకు పూర్తిగా తెలీదు. మీకు ఆ అవసరమే కనుక ఉంటే, నేను చేసే ఆఫీస్ లో ఒక ఉద్యోగం ఇప్పించగలదీ స్నేహితురాలు. ఒక వారం క్రితం, నేను పనిచేసే డిపార్ట్ మెంట్ లోనే ఒక పోస్టింగ్ పడింది. ఆ కేండిడేట్ ని నేనే సెలెక్ట్ చెయ్యాలి. జీతం కూడా బాగానే ఉంటుంది.

ఆ మాట చెప్పగానే, శ్వేత నా చేతులు గట్టిగా పట్టుకుంది. తన కళ్ళ నిండా నీళ్ళు. కృతజ్ఞత చెప్పటానికి మాటలే అవసరం లేదు అని ఆ క్షణం అర్ధమైంది నాకు. తను నోటితో చెప్పలేకపోయిన విషయం. నా చేతులు పట్టుకున్న ఆ స్పర్శ చెప్తుంది.

ఈ మాట చెప్పి, అక్కడ టేబుల్ మీద ఒక పది వేల రూపాయలు ఉంచాను. శ్వేత ఆశ్చర్యంగా చూసింది. మీరు రేపే జాబ్ లో

జాయిన్ అయినా, వచ్చే నెల వరకూ మీ ఖర్చులకి ఇది ఉంచండి. మీ దగ్గర ఉన్నప్పుడు నాకు ఇవి తిరిగి ఇవ్వొచ్చు అని చెప్పి ఇంటికి వచ్చేసాను.

ఆ తర్వాత రోజే శ్వేతకి ఇంటర్వ్యూ అవ్వటం, అప్పాయింట్మెంట్ ఆర్డర్ రావటం, వెంటనే ఉద్యోగంలో జాయిన్ అవ్వటం చకచకా జరిగిపోయాయి. రోజూ నాలుగింటికి స్కూల్ నుంచి వచ్చాక పాప ఒక రెండు గంటలు ఆ వీధి చివరన ఉన్న ప్లే స్కూల్లో ఉండే ఏర్పాటు చేసాం. శ్వేత ఆఫీస్ నుంచి వస్తూ పాపని ఇంటికి తీసుకొస్తుంది. శ్వేత ఉద్యోగంలో జాయిన్ అయ్యి, ఒక నెల గడిచిపోయింది. ఈ నెల రోజుల్లో, మా మధ్య మీరు నుంచి నువ్వు అని పిలుచుకునేంత చనువు ఏర్పడింది.

ఒక రోజు మేమంతా ఆఫీసు లో లంచ్ అవర్ లో లంచ్ చేస్తూ ఉండగా, ఒక కొలీగ్ వచ్చి పెళ్ళి కుదిరిందని, స్వీట్స్ పంచిపెడుతున్నాడు. ఆ స్వీట్ తీసుకుని, అతనిని కంగ్రాచ్యులేట్ చేసిన శ్వేత సడెన్ గా నా వంక చూసి, నువ్వెప్పుడు పెడతావ్ పప్పన్నం అని అడిగింది. క్షణం లో వెయ్యేవంతు నా మొహం లో మారిన భావాలు చూసి నిశ్శబ్దంగా ఉండిపోయింది. మళ్ళీ దానిగురుంచి నన్ను రెట్టించి ఆరా తియ్యలేదు. ఆ గుణమే నాకు శ్వేత లో నచ్చుతుంది.

ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చేటప్పుడు నేనెవరికీ చెప్పటానికి ఇష్టపడని నా కథని నాకెందుకో శ్వేత కి చెప్పాలనిపించింది. శ్వేతా! నా పెళ్ళి ఎప్పుడు అని మధ్యాహ్నం అడిగావ్ కదా! "నా పెళ్ళి ఇదివరకే అయ్యింది." నా మాటలకి ఆశ్చర్యంగా, నమ్మలేనట్టు నా వంక చూసింది శ్వేత. నిజమే శ్వేతా! ఆరు నెలల క్రితం నా పెళ్ళి జరిగింది. ఇంట్లో చూసిన సంబంధమే. మా సంబంధం అన్ని విధాలా నచ్చిందన్నారు. కట్నకానుకుల విషయం పట్టింపు లేదన్నారు. మేము ఇద్దరం ఆడపిల్లలమే. నాకు ఒక చెల్లి ఉంది. ఎలాగూ ఆడపిల్లలమే కాబట్టి, ఉన్నది ఏదైనా, ఎప్పటికైనా, చెరో సగం వస్తుంది కాబట్టి, కట్నకానుకుల దగ్గర గట్టిగా లేరు అనుకున్నాం. పెళ్ళికొడుకు ముభావంగా ఉండటం చూసి అందరూ నెమ్మదస్తుడు అనుకున్నారు. నేను చాలా తొందరగా కొంగుకు ముడేసుకోవచ్చు అని అందరూ ఆట పట్టించారు. ఏ ఇబ్బందీ లేకుండా పెళ్ళి జరిగిపోయింది.

ప్రతి మనిషీ ఎన్నో కలలు కంటాడు. అందుకు నేనేమీ అతీతురాలిని కాదుగా? అందరాడపిల్లల్లాగానే నేను కూడా, జీవితం మీద ఆశలు అంటారో, కోరికలు అంటారో, ఏం పేరు పెట్టాలో తెలీదు కాని, ఇది అని చెప్పలేని ఒక ఫీలింగ్ తో పెళ్ళి చేసుకున్నాను. ఆ రోజు మా మొదటి రాత్రి. అతని మొహంలోకి చూడగానే అర్ధమైంది. అతను సంతోషంగా లేడు అని. చాలా అసహనంగా అటూ, ఇటూ తిరుగుతున్నాడు. నాకు పలకరించాలంటే మనసు రావటం లేదు. అక్కడ ఏదో అసహజంగా ఉంది. పది నిమిషాలు నుంచున్నాకా, నేను మంచం మీద కూర్చున్నాను. నేనే ఏమన్నా మాట్లాడతానని ఆశించాడేమో తెలీదు. కొంచెంసేపటికి నా దగ్గరగా వచ్చి నిలబడ్డాడు. నాకు ఈ పెళ్ళి అన్నా, నువ్వన్నా ఇష్టం లేదు. నాకు ఇష్టం లేకుండా ఈ పెళ్ళి చేసారు. నేను వేరే అమ్మాయిని ప్రేమించాను. నేను నీతో కాపురం చెయ్యలేను. నేను ప్రేమించిన అమ్మాయినే మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను. నాకు విడాకులు కావాలి అని పాఠం అప్పచెప్పినట్టు చెప్పేసాడు.

నాకు కొంచెంసేపు ఏమీ అర్ధం కాలేదు. అర్ధం అయ్యాకా, కళ్ళు గిర్రున తిరిగాయి. కాళ్ళకింద భూమి చీలిపోయినట్టుంది. కానీ నేను

కూర్చునే ఉన్నాను. భూమిలో కూరుకుపోలేదు. నాకు ఏం చెప్పటానికీ మాట రాలేదు. చెంప పగలగొట్టాలనిపించింది. కానీ చేయి లేవలేదు. ఈ మాట ఒక్క రోజు ముందన్నా, వాళ్ళ అమ్మా, నాన్నలకి గట్టిగా చెప్పలేకపోయిన వాడి అసమర్ధతకి బలి అయ్యింది నా జీవితం.

నా పెళ్ళి గురించి వెటకారంగా మాట్లాడుకోటానికి ఊరిలో నలుగురికీ ఒక అవకాశం దొరికింది. మా ఇంట్లో వాళ్ళకి పరువు పోయింది అనే బాధ మిగిలింది. బంధువులకి నాది దురదృష్ట జాతకం అనే నమ్మకం కలిగింది. నాకు మాత్రం, నా జీవితం ఒక పుస్తకంలా మారి నా చెతిలోకి వస్తే, అందులో నుంచి ఈ రెండు రోజుల పెజిలనీ చింపెయ్యాలనిపించింది. ప్రేమించిన విషయం అమ్మ, నాన్నలకి గట్టిగా చెప్పి ఒప్పించకుండా, నా జీవితం తో ఆడుకున్న ఆ వెదవ మీద చంపెయ్యాలన్నంత కోపం వచ్చింది.

నాకు ఇలా జరిగింది అని ప్రపంచం స్థంబించిపోలేదు. ఎదుటివాళ్ళ కష్టాలు చూసి ఆనందించే ప్రపంచానికి నాదొక టైం పాస్ కథ. అందుకే నేను దాన్ని చిన్న సమస్య లాగానే తీసుకున్నాను. నిజానికి ఎంతోమందికి వచ్చే సమస్యలతో పోల్చితే నాది చిన్న సమస్యే. కనీసం నాకు ఉద్యోగం ఉంది. నా బ్రతుకు నేను బ్రతకగలను.

ఆ సమస్య ని పెద్దమనుషుల్లోకి తీసుకొచ్చి, పెద్దది చేసి, ఇద్దరి ప్రేమికులని విడగొట్టటం నాకు ఇష్టం లేదు. దానివల్ల ముగ్గురి జీవితాలు నాశనం అవుతాయి. అందుకే విడాకులకి అప్లై చేసాం. పెళ్ళి కోసం కొన్న పిన్నీసు ఖర్చు కూడా వడ్డీతో సహా వాళ్ళదగ్గరనుంచి వసూలు చేస్తున్నాను. అంతకంటే, కసి తీర్చుకునే మార్గం నాకు దొరకలేదు.

“ఇంక నువ్వు పెళ్ళి చేసుకోవా”? అంతా విని శ్వేత అడిగిన ప్రశ్న. నేనెందుకు చేసుకోకుండా ఉండాలి? నా ఎదురు ప్రశ్న. ఖచ్చితంగా చేసుకుంటాను శ్వేత. ఇంక నా జీవితం లో ఏం మిగల్లేదని, అంతా ఆ పెళ్ళితోనే అయిపోయిందని అనుకోను. అదొక పీడకల అనుకుంటాను. కానీ, మనసులో ఆ సంఘటన ఇంకా పచ్చిగానే ఉంది. ఆ గాయం మానాకా, తప్పకుండా చేసుకుంటాను.ఈ లోపు విడాకులు కూడా రావాలిగా!

శ్వేతా! నా బుర్ర చాలా వేడిగా ఉంది. నీ చేతి స్ట్రాంగ్ కాఫీ కావాలి అని అడిగాను. నేను ఎంత కాఫీ ప్రియురాలినో తెలిసిన శ్వేత నవ్వింది. దారిలో పాపని ప్లే స్కూల్ నుంచి తీసుకుని ఇంటికి వెళ్ళాం. శ్వేత ఇచ్చిన కాఫీ తాగి ఇంటికి బయలుదేరాను నేను.

నేను బయటకి రావటం కిటికీలో నుంచి కామాక్షమ్మ గారు చూస్తూనే ఉంది. శ్వేత ఇంటికి నా రాకపోకలు ఎక్కువయ్యాయని ఆమె గమనిస్తూనే ఉంది. ఆవిడని చూసి పలకరింపుగా నవ్వాను. చూసీ, చూడనట్టు అవిడ మొహం తిప్పేసుకుంది. నేను, శ్వేత అంత చనువుగా ఉండటం బహుశా ఆవిడకి అంత నచ్చలేదనుకుంటాను. రేపటి నుంచీ, ఇద్దరం కలిసి చెడు తిరుగుళ్ళు తిరుగుతున్నాం

అని చెప్తుందేమో మరి అందరికీ.

మన కష్టాలు చెప్తే విని ఆనందించటానికి, నీ చెల్లిలాంటి దాన్ని, అక్కలాంటి దాన్ని అని వరసలు కలిపే ఈ జనాలు, కష్టం లో ఉన్నాను సాయం చెయ్యమంటే మాత్రం కనీసం మనిషిలా స్పందించరు సరికదా! కష్టాల్లో ఉన్న వాళ్ళు అందులోనుంచి బయటకి వచ్చి వాళ్ళ బతుకు వాళ్ళు బతుకుతుంటే కూడా చూసి ఓర్చుకోలేరు. ఇదే లోకం పోకడ.




పూర్వం వైశాలి నగరంలో వరదయ్య శ్రేష్టి అనే ఒక వర్తక ప్రముఖుడు ఉండేవాడు. అతనికి వైశాలి నగరంలోనే అత్యంత పేరు పొందిన వజ్ర వైడూర్యాలు, నగల వ్యాపారం ఉండేది. వైశాలి నగరం భోగ భాగ్యాలతో తులతూగుతుండేది. వైశాలి నగరంలోని ఎందరో సంపన్నులు ఆయన దగ్గర వజ్ర వైడూర్యాలు, బంగారు నగలు కొనేవారు. దేశ విదేశాలనుంచి విలువైన వజ్రాలు, వైడూర్యాలు తెప్పించి, పేరు మోసిన స్వర్ణకారులతో అందమైన ఆభరణాలను తయారు చేయించి సరసమైన ధరలకే వరదయ్య శ్రేష్టి విక్రయించేవాడు. నిజాయితీగా వ్యాపారం చేస్తాడని మంచి పేరు రావటంతో పుర ప్రముఖులందరూ తమ ఇళ్ళల్లో జరిగే పెళ్ళిళ్ళు, ఇతర శుభ కార్యాలకు అవసరమైన వజ్రాలు, నగలు వరదయ్య శ్రేష్టి దగ్గరే కొనుగోలు చేసేవారు. వైశాలి నగరంలో వేరే దుకాణాలు ఉన్నా అందరూ వరదయ్య శ్రేష్టి దగ్గరే కొనుగోళ్లకు మక్కువ చూపేవారు.

వరదయ్య శ్రేష్టి కి ఒక్కగా నొక్క కొడుకు సురేంద్ర శ్రేష్టి. చిన్న తనం నుండే తండ్రి తో పాటు దుకాణం లో ఉంటూ వ్యాపార నిర్వహణలో మెలకువలు నేర్చుకున్నాడు సురేంద్ర శ్రేష్టి. కొంతకాలానికి తన కుమారుడు ఎదిగి అంది వచ్చాడని, ఒక్కడే వ్యాపారం చక్కగా చూసుకోగలిగే స్తితి లో ఉన్నందున తానూ తన భార్య, బంధు మిత్రులతో కొద్దికాలం పాటు తీర్ధ యాత్రలు చేసి పుణ్య క్షేత్రాలను దర్శించి వద్దామని తమ వ్యాపారాన్ని కొడుక్కి అప్పగించి వరదయ్య శ్రేష్టి తీర్ధ యాత్రలకు బయలు దేరాడు.

ఒక రోజు సురేంద్ర శ్రేష్టి దగ్గరకు రామ శాస్త్రి అనే ఒక బ్రాహ్మణుడు వచ్చాడు. అతను వైశాలి నగరం సమీపంలో ఉన్న మాధవనగరం నుండి వచ్చాడు. ఆ వూరు వాడైన సురేంద్ర శ్రేష్టి చిన్ననాటి మిత్రుడు గోపాలుడు ఒక సిఫార్సు లేఖ ఇచ్చి పంపాడు. రామశాస్త్రి కి ఏదైనా వ్యాపారం చేసుకోవటానికి సహాయం చేయవలసిందిగా అర్ధిస్తూ గోపాలుడు లేఖ వ్రాసాడు. చిన్ననాటి మిత్రుడి మాట మన్నించి రామ శాస్త్రి ఏ వ్యాపారం చేయాలనుకుంటున్నాడో తెలుసుకున్నాడు సురేంద్ర శ్రేష్టి. రామ శాస్త్రి నస్యం తయారు చేయటంలో మంచి అనుభవం ఉన్నవాడు. వైశాలి నగరంలో చాలా మంది ప్రముఖులకు నస్యం పీల్చటం అలవాటు అని తెలిసింది -- మీరు అనుమతిస్తే మీ దుకాణం ముందర ఒక మూలగా నా నస్యం వ్యాపారం ప్రారంబిస్తాను అని రామశాస్త్రి చెప్పటంతో సురేంద్ర శ్రేష్టి అంగీకరించాడు. త్వరలోనే రామశాస్త్రి నస్యం వ్యాపారం వరదయ్య శ్రేష్టి నగల దుకాణం ముందర ఉన్న ఒక అరుగు మీద మొదలు అయింది. రామ శాస్త్రి తయారు చేసి అమ్మే నస్యానికి మంచి పేరు రావటంతో క్రమేణా రామశాస్త్రి నస్యం దుకాణము లో వ్యాపారం పెరగసాగింది. ఎప్పుడు చూసినా ఒక అయిదారుగురు రామశాస్త్రి నస్యం దుకాణం దగ్గర కనిపించే వారు.

ఆశ్చర్యకరంగా ఇదే సమయంలో సురేంద్ర శ్రేష్టి నగల వ్యాపారం రోజు రోజు కి క్రమేణా తగ్గిపోసాగింది. పెద్ద పెద్ద బేరాలు వచ్చినట్లే వచ్చి ఉన్నట్లుండి వెనక్కు పోయేవి. సురేంద్ర శ్రేష్టి కి అలా ఎందుకు జరుగుతుందో అంతు పట్టేది కాదు.

ఈ లోగా తీర్ధయాత్రలకు వెళ్ళిన వరదయ్య శ్రేష్టి యాత్రలు ముగించుకొని వైశాలి నగరానికి తిరిగి వచ్చాడు. ఒక రోజు దుకాణానికి వచ్చి పద్దు పుస్తకాలు సరి చూసుకొన్నాడు. తమ వ్యాపారం రోజు రోజుకీ దిగజారి పోతున్నట్లు గమనించాడు. అలా ఎందుకు జరుగుతుందో వరదయ్య శ్రేష్టి కి రెండు రోజులలో అర్ధమైంది. ఎవరైనా మంచి విలువైన వజ్రాభరణాలు కొనుగోలు కోసం వచ్చి నప్పుడే రామ శాస్త్రి దగ్గర నస్యం కొన్న వారిలో ఎవరో నస్యం పీల్చి తుమ్మేవారు. ఒక్కొక్క సారి నస్యం ఘాటుకు రెండు మూడు తుమ్ములు కూడా తుమ్మటం కద్దు. ఆ తుమ్ముల శబ్దం వింటూనే తుమ్మును అప శకునం గా భావించిన కొనుగోలుదారులు కొనుగోళ్లను వాయిదా వేసుకోవటమో, లేక అత్యవసరంగా కొనవలసిన వారు వేరే దుకాణం లో కొనటమో చేస్తున్నట్లు వరదయ్య శ్రేష్టి గమనించాడు. ఇలా రామ శాస్త్రి నస్యం వ్యాపారం తమ దుకాణం ముందే చేసుకోవటానికి అనుమతి ఇవ్వటం వల్లనే తమ వ్యాపారానికి దెబ్బ తగిలిందని అనుభవజ్ఞుడైన వరదయ్య శ్రేష్టి తెలుసుకున్నాడు. తన కుమారుడికి వ్యాపార నిర్వహణ లో అనుభవం వచ్చింది గానీ లోక జ్ఞానం సరిగా రాలేదని గ్రహించాడు.

వరదయ్యయ శ్రేష్టి మరు నాడే రామ శాస్త్రిని పిలిపించి తానే స్వయంగా ఆ వీధి చివర లో ఉన్న ఒక దుకాణాన్ని రామశాస్త్రి కి బాడుగకు ఇప్పించి అతని నస్యం దుకాణాన్ని ఆ వీధి చివరలో ఉన్న మరో ప్రాంతానికి తరలించాడు. ఆశ్చర్యకరంగా కొద్ది కాలానికే మళ్ళీ వరదయ్య శ్రేష్టి వ్యాపారం పుంజుకొంది. మళ్ళీ ఎప్పటిలా వరదయ్య శ్రేష్టి దుకాణం కొనుగోలుదారులతో కళకళ లాడ సాగింది. సురేంద్ర శ్రేష్టికి ఇదంతా ఏమీ అంతు పట్టకుండా ఉన్నది.

ఒక రోజు వరదయ్య శ్రేష్టి సురేంద్ర శ్రేష్టి ని దగ్గరకు పిలిచి --నీ స్నేహితుడి సిఫార్సు మూలంగా రామ శాస్త్రి కి సాయం చేయాలనే నీ ఉద్దేశ్యం మంచిదే ! దానిని తప్పు అనను. కానీ అది కాస్తా "తనను మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరంగా" మారింది. రామశాస్త్రి అమ్మే నస్యం పీల్చిన జనాలు తుమ్మటం మన వ్యాపారాన్ని దెబ్బ తీసింది. ఆ తుమ్ముల దెబ్బకు మన వ్యాపారం దెబ్బతిన్నది. మనలో చాలా మంది తుమ్మును అపశకునముగా భావించుతారు. అంటే రామశాస్త్రి చేసే నస్యం వ్యాపారం మన వ్యాపారానికి చుక్కెదురు అన్న మాట. ఈ సంగతి నేను వివరించ గానే రామశాస్త్రి కూడా అందులోని విషయాన్ని అర్ధం చేసుకున్నాడు. అందుకే రామ శాస్త్రి కి నష్టం లేకుండా, అతని జీవనోపాధికి ఇబ్బంది రాకుండా అతని నస్యం దుకాణాన్ని మన దుకాణానికి దూరంగా మార్పించాను. ఫలితం నువ్వు చూసావుగా?" అన్నాడు వరదయ్య శ్రేష్టి. నిజమే నంటూ తల ఊపాడు సురేంద్ర శ్రేష్టి.




యధావిధిగా నేను;రాంబాబు వాకింగ్ కి బయలుదేరాం.

తెలతెల వారుతోంది. చల్లని గాలి హాయిగా ఉంది. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.

అప్పుడే ఉదయిస్తున్న సూర్యుని లేత కిరణాలు నులివెచ్చగా ఉన్నాయి.

పిచ్చాపాటి మాట్లాడుకుంటూ అలా రామాలయం చేరుకున్నాం. అక్కడ జనాలు గుమిగూడి ఉన్నారు. పోలీస్ హడావుడి వుంది. ఏమయిందోనని దగ్గరికి వెళ్ళాం.

తెల్లవారి ఝామున ఎవరో రామాలయం దగ్గరి పొదల్లో ఒక శిశువుని వదిలేసి పోయారట. గుక్కపట్టి ఏడుస్తుంటే అటు వెళ్తున్న వారు చూసి పోలిసులకు ఫోన్ చేశారట. ఇంతలో మహిళా సంఘాలు; జనం గుమికూడిపోయారు.

"ఎవరు బిడ్డో ...ఏమో..." కొంతమంది బుగ్గన వేలేసుకుంటున్నారు.

"అయ్యో పాపం... గుక్కతిప్పుకోకుండా ఏడుస్తుంటే ఎలా?" మరికొంతమంది జాలి పడుతున్నారు.

"పాలయినా పట్టండి...లేదా చక్కెర నీళ్ళయినా..." ఒక పెద్దావిడ అరుస్తోంది.

ఇంతలో గ్లాసులో ఎవరో ఏదో తెచ్చి ఇచ్చారు. ఆ పెద్దావిడ గ్లాసులో వేలు ముంచి; బిడ్డ నోట్లో పెట్టింది. అలా నాలుగయిదు సార్లు చేసే సరికి బిడ్డ ఏడుపు ఆపింది.

"అయ్యో పాపం ...ఎవరి కన్నబిడ్డో"

"ఇంకా కళ్ళు కూడా తెరవలేని పసిగుడ్డు ...వారికి మనసెలా వచ్చిందో..."

"ఇంకా నయం ఏ కుక్కో చూడలేదు.అదృష్టం బాగుండి..."

"బిడ్డ ఎంత ముద్దుస్తున్నాడో..."

"పండంటి మగబిడ్డ ...ఇలా పారేయడానికి చేతులెలా వచ్చాయో.."

"ఎవరో చేసిన పాపాన్ని ఇలా వదిలించుకున్నారు."

"బిడ్డని అనాధను చేశారు"

"ఇలాంటి వారిని ఏం చేసినా పాపం లేదు."

"కొవ్వెక్కి కడుపు చేసుకుని గుట్టుచప్పుడు కాకుండా వదిలించుకొంది మహాతల్లి ఎవరో.."

"పాపం ఆడపిల్లేం చేస్తుంది. ఎవడి మాయమాటలకి బలయిపోయిందో? ఈ రోజుల్లో మగపిల్లలు వీధి రౌడీల్లాగా కత్తులతో; యాసిడ్ బాటిల్లతో

"ప్రేమిస్తావా? చస్తావా?" అని బెదిరిస్తుంటే..." రాగం తీసింది ఓ పెద్దావిడ.

"అవునవును. బలాత్కారాలు; మానభంగాలు ఎన్ని చూడ్డం లేదూ?"

"అయినా ఈ కాలం పిల్లలు మరీ పరితెగించిపోతున్నారు. హైస్కూల్లోనే ప్రేమలూ...కడుపులూనూ"

"దానికు తోడు సినిమాలు, టీ వీ లు; సెల్ ఫోన్లు; ఇంటర్నెట్లు... పిల్లలు చెడిపోక ఏమవుతారు?"

"ఎవర్నని ఏం లాభం? కలికాలం. కాలం చెడిపోయింది. మా కాలంలో ఇలా లేదమ్మా?"

ఎవరి అభిప్రాయాలు, సందేహాలు; సలహాలు యథేచ్ఛగా సాగాయి. ఆడవాళ్ళ సానుభూతి పవనాలు వీచాయి.

ఇంతలో ఒక అనాధ ఆశ్రమం నుంచి ఒకామె కార్లో దిగింది. వెనువెంటనే టీ వీ బృందం; పత్రికా విలేఖర్లూ విచ్చేశారు. ఆమె ఆ పసికందును చేతుల్లోకి తీసుకుంది. తలపై మృదువుగా నిమిరింది.నుదుటిపై సున్నితంగా ముద్దుపెట్టుకుంది. ఆ తర్వాత ఒళ్ళో పడుకోపెట్టుకుని కెమెరా వైపు ముఖం తిప్పి తమ అనాధ ఆశ్రమం స్థాపన ఆశయాల్ని; చేస్తున్న సేవా కార్యక్రమాల్ని అరగంట ఏకరువుపెట్టింది.

"ఈ బిడ్డ సం రక్షణా బాధ్యతల్ని మా ఆశ్రమం తీసుకుంటుంది" అని సగర్వంగా అందరి చప్పట్ల మధ్య భరోసా ఇచ్చింది. కెమెరాలు క్లిక్కుమన్నాయి. టీ వీ ల్లో లైవ్ ప్రసారాలయ్యాయి. మరో అరగంటలో అందరూ వెళ్ళిపోయారు.

"రాన్రాను మానవ విలువలు పడిపోతున్నాయి. కన్నపేగులిప్పుడు పాషాణాలయిపోతున్నాయి." రాంబాబు ఆవేదన వ్యక్తం చేశాడు.

మళ్ళీ నడక ప్రారంభించాం. ఒక పావు గంట నడిచామో లేదో మరో దృశ్యం మా కంటపడింది.

ఒక కుక్క రోడ్లో వెళ్తున ప్రతి కారు వెంట అరుస్తూ పరుగెడుతోంది. మళ్ళి వెనక్కి వచ్చి మరో కారు వెంట పరుగెడుతోంది. అలా రోడ్ పై వెళ్తున్న ఏ కారుని వదలడం లేదు. కనిపించిన ప్రతి కారుని కొంత దూరం వెంటపడి తరుముతోంది. ఆ దృశ్యం నాకెందుకో వింతగా అనిపించింది. మరే వాహనాన్ని ఏమీ అనడం లేదు. కార్లని మాత్రం వెంటాడుతోంది. అయిదు నిమిషాలు నిలబడి అలాగే చూస్తుండిపోయాం.

ఇంతలో అక్కడున్న ఒకతను విషయం చెప్పాడు. విని ఆశ్చర్యపోవడం మావంతయింది. సృష్టిలో ఇలాంటివి కూడా వుంటాయా? కళ్ళ ముందు కనబడుతుంటే నమ్మకపోవడమేంటి?

దాని పిల్లను గంట క్రితమే ఓ కారోడు గుద్దేసి వెళ్ళిపోయాడట. పాపం…కుక్కపిల్ల చచ్చిపోయింది. అప్పట్నుంచి ప్రతి కారుని ఇలా

వెంటాడుతోందట.

కారుని వెంటాడడం; అంతలోనే చచ్చిన కుక్కపిల్లని వాసను చూడడం; దాని చుట్టూ తిరగడం ...ఇంతలో మరో కారు వస్తే వెంటపడడం; మళ్ళీ వెనక్కి వచ్చి కుక్కపిల్లను పక్కకి లాగడం; దాని చుట్టూ తిరుగుతూ రోదించడం ...మరో కారు వస్తే రొప్పుతూ పరుగెత్తడం ...హృదయవిదారకమైన అరుపులు... మూగజీవి వేదన ...బిడ్డను పోగొట్టుకున్న ఓ మూగజీవి ఆవేదన ...మౌన రోదన మా హృదయాని కలచివేసింది.

నోరులేని జీవి కుక్క. తనపిల్లను ఎవడో చంపేశాడని కసిగా ప్రతి కారుని వెంటాడుతోంది. శక్తికి మించి పరుగెడుతోంది.

కారు కాబట్టి సరిపోయిందికానీ... ఆక్షణంలో దాని నోటికి ఎవరు దొరికినా ముక్కలు ముక్కలు చేసి తన పగను తీర్చుకొనేది. అంత కసి...అంత కక్ష..అంత పగ దాని కళ్ళలో స్పష్టంగా కనిపిస్తోంది. పాపం మూగ జీవి. అంతకన్నా ఇంకేం చేయగలదు. అయినా పట్టుదల వీడడంలేదు. ప్రతి కారునీ వెంటాడి వేటాడుతోంది.

అన్నీ వుండీ నోరులేని పసికందును ముళ్ళ పొదల్లో పడేసింది ఒక మానవతల్లి. తన బిడ్డను చంపిన హంతకుని కోసం ప్రతి కారు వెంటా పరుగులు తీస్తోంది అవిశ్రాంతంగా - మూగగా రొప్పుతూ; రోదిస్తూ; అరుస్తూ ఒక కుక్కతల్లి. కుక్కకున్న కడుపుతీపి మనుషుల్లో కరువయిందని విచారిస్తూ వెనుదిరిగాం. *




“ఓయ్ !..సాఫ్ట్ వేరూ..మీ జాడీకి ఫోను చేశావా ?..మన ఫ్లైట్ టికెట్స్ కన్ఫం అయి పోయాయి..ఫెస్టివల్ కు వారం ముందే మనం భాగ్యనగరంలో కాలు పెట్ట బోతున్నాం..ఐ ట్వంటీ క్రింసన్ రెడ్ నా పేరుమీద బుక్ చేయమని చెప్పు..డెలివరీ పాయింటు మాత్రం..విజయవాడని మెన్షన్ చేయించమని చేప్పు.. “

హైదరాబాదులో ఎందుకు..మనూళ్లో మీరే బుక్ చేసుకో వచ్చుగా ?

భర్త ను ఆశ్చర్యంగా చూస్తూ ప్రశ్నించింది.. మల్టినేషనల్ ఐటి కంపెనీలో ఈవెంట్ మేనేజరుగా జాబ్ చేస్తున్న..రమ్య.

ఇక్కడైతే నా ఎకౌంట్ లోపడిపోతుంది..అక్కడైతే మీ నాన్న ఎకౌంటు..దట్సిట్...

ఇద్దరం జాబ్ చేస్తున్నాం..లక్ష పైన డ్రా చేస్తున్నాం..మొదటి పండక్కి పల్సరన్నారు..రెండో పండక్కి ఐ ఫైవ్ కొనిచ్చారు..ఇప్పుడు కారంటున్నారు..మా నాన్న గారు రాజకీయ నాయకుడూ కాదు ..బిజినెస్ మేగ్నెటూ కాదు..

తెలుసు..బేంక్ మేనేజరని..  మరి నేనెవరో తెలుసా? అల్లుడ్ని.. పైగా ద గ్రేట్ సెంట్రల్ గవర్న మెంట్ ఎంప్లాయిని .. అందుకనే కోటి కట్నమిచ్చారు. నా తర్వాత మా చెల్లెలుంది..దానికీ కట్నం యివ్వాలి..బోలెడు ఖర్చువుంటుంది..ఇలా అడిగిమరీ తీసుకోవడం..నాకు ఎంబ్రాసింగ్ గా వుంటుంది.. మీ కారువిషయం మీరే మాట్లడు కోండి..నన్ను మాత్రం ఇన్ వాల్వ్ ...చేయకండి..

భార్య సమాధానాన్ని జీర్ణించుకోలేకపోయిన రమేష్ బాబు ..రమ్యా అని అరవబోతూ ఇంటిముందు ఆగిన టేక్సీని చూస్తూనే..నోరు తెరిచేశాడు. టేక్సీలోంచి  హాయ్ బావా అంటూ విష్ చేసి దిగుతున్న మరదల్ని లాయర్ డ్రస్ లో చూస్తూ..పజిలై పోయాడు.

చెల్లిని చూస్తూనే హాయ్ దివ్యా అంటూ వచ్చిఅల్లుకు పోయింది రమ్య.

*********

సారీ బావా ..మార్నింగే వచ్చాను..ఫోన్ చేద్దామనుకుంటూనే మీరిద్దరూ ఆఫీసుల్లో బిజీగా వుంటారని డిస్టర్బ్ చేయలేదు.టుబి ఫ్రాంక్ మార్నింగ్ నుంచి  ఫ్యామిలి కోర్టులో నేనూ ఫుల్ బిజి. మీ ఊరి అమ్మాయి కేసే.

అక్క యిచ్చిన ఫిల్టర్ కాఫీని సిప్ చేస్తూ సోఫాలో రిలాక్సై పోతూ  తన రాకను  వర్ణించడానికి తయారై పోయింది.

అంటే కేసులు వాదించడానికి ఈవూర్లో లాయర్సే లేరా లాయర్ మరదలా..?

లాయర్స్ లేక కాదు బావా.ఈ కేసులో ముద్దాయిలు..మా మేడం క్లైంట్సు. మా మేడం గారు..ఢిల్లీలో సుప్రీం కోర్టులో హెల్డప్పైపోయారు.హోప్ లెస్ కేసే .. బట్ లాయర్ ప్రెజన్స్ కోసమని  వచ్చాను. పెళ్లైన ఏడుసంవత్సరాల లోపు అమ్మాయి ఆత్మహత్యచేసుకున్నా..డౌరీ హెరాస్ మెంట్ ప్రూవైనా నో బెయిల్..మినిమం సెవెన్  యియర్స్ ఇంప్రిజన్ మెంట్ టు ద ఎంటైర్ ఫ్యామిలి. సుప్రీంకోర్టు ఎప్పుడో యిచ్చిన ఈ జడ్జిమెంటును మతిమరుపు దున్నపోతులకోసం మరోమారు అన్ని న్యూస్ పేపర్లలో పబ్లిష్ చేసింది.. మీరూ చూసేవుంటారు.

ఔను..నేను గూగుల్ న్యూస్ లో చదివాను.

వేడి వేడి పకోడీల ప్లేటు అందిస్తూ రమ్య .అంది.

కధ మానేసి ..కాకమ్మ కధలు చెప్తున్నావ్   ..మావూరమ్మాయన్నావ్ ..ఇంతకీ ఎవరా అమ్మాయ్? సంగతేంటో చెప్పు.

రమేష్ బాబు అడిగిన ప్రశ్నకు   సమాధానంగా అదోలా నవ్వి   ..

ఇవేమైనా బాహుబలి లాంటి ఫాంటసీ కథలా బావా?మన దేశంలో ఏదోఒక మూల..ప్రతి రోజూ ..కట్నాల కోరల్లో బలై పోతున్న..ఆడపిల్లల ..అభాగ్య జీవితాలే కద బావా ?..అనుక్షణం ఆనవాయితీలు ..కట్న కానుకలంటూ కక్కుర్తి పడే మగతనం లేని కీలుబొమ్మ లాంటి భర్త.. ఆస్థిపాస్తులన్నా..కుక్క కక్కిన కూడు లాంటి..కట్నాలకు కక్కుర్తి పడే అత్తమామలు..ఫ్యూచర్లో నా బతుకూ ఇంతేనన్న ఇంగిత జ్ఞానంలేని ఆడపడుచులు..చదువున్నా సంస్కారమంటని బావలూ మరుదులూ..ఇంటింటి..రామాయణాలే కద బావా..అడిగారు కాబట్టి చెప్తాను..మా క్లైంటు అమరావతి ఆడపడుచు. అమెరికా సంబంధమని నమ్మి కట్న కానుకలిచ్చి

ఓ వెధవకి కట్ట బెట్టేశారు. పెళ్లైన ఆరు నెలలకే   మనోడి కేలిబర్ కి తట్టుకోలేని అమెరికా కంపెనీ..పింక్ లెటర్ చేతికిచ్చి ..ఇంటికి సాగనంపారు.నా కొడుకు ఎదవని ఒప్పుకోలేని ఆదర్శ అమ్మానాన్నలు..కోడలిది కొంపలు కూల్చేపాదమని ..కొడుకూ కూతుళ్లతో కలిసి కీర్తనలు పాడేశారు. అది మొదలు అమ్మాయి బ్రతుకు దిన దిన గండం అయి పోయింది. సాధింపులతో బాటు భర్త గొంతెమ్మ కోర్కెలకు బలి పశువై పోయింది. మొదటి సంక్రాంతికి మోటర్ బైకన్నాడు..మరుసటి పండగకి ఐ టెన్ అన్నాడు.. మూడో పండక్కి మూడెకరాల పొలం అన్నప్పుడు ఎదురు తిరిగంది.

మా నాన్నకు మిగిలిందే ముడెకరాలు..ఆరెకరాల్లో మూడెకరాలమ్మి నా పెళ్లికి కట్నం యిచ్చారు. నా ఇద్దరు చెల్లెళ్ల పెళ్లిళ్లు చెయ్యాలి. వాళ్లు బ్రతకాలి నా గొంతులో ఊపిరి పోయినా ఈ అన్యాయం జరగనివ్వనని ఎదురు తిరిగింది. భర్తతో బాటు అత్తా మామలు ఆడ పడుచు మరిది రాక్షసులై పోయారు. మానసికంగా శారీరకంగా హింసించారు. ఆరళ్లకు తట్టుకోలేని అమరావతి ఆడ పడుచు విమెన్ ప్రొటెక్షన్ సెల్ కు లెటర్ రాసి ఆత్మహత్య చేసుకుంది.

ఒక్క సారిగా మాటలాపేసి మూడీగా మారి పోయింది   దివ్య.

రమ్య చెల్లిని దగ్గరా తీసకుని..

దివ్యా ..ఐ పిటీ హర్..ఆత్మహత్యే అంతిమ నిర్ణయమనుకొంటూ    నేటి యువత రాంగ్ రూట్ లో ట్రావెల్ చేస్తోంది. నీ ప్రొఫెషన్ లో ఇలాంటి వి తప్పవు.

మరీ యింత సెన్సిటివ్ గా వుంటే ఎలా..?

అది కాదక్కా..ఆ అమ్మాయీ మన లాంటి ఆడ పిల్లేగా ..ఆడ పిల్లగా పుట్టడమేనా ఆ అమ్మాయి తప్పు..ఇలాంటి నంఘటన రేపు నీకో నాకో ఎదురవ్వదన్న గ్యారెంటీ వుందా..?

ఓకే..ఓకె..ఇట్స్ ఓకే..సస్పెన్స్ లో పెట్టక కోర్ట్ లో ఏం జరిగిందో చెప్పేస్తే నేను రైస్ కుక్కర్ పెట్టాలో పిజా హౌస్ కు మీ బావను పరుగెత్తించాలో డిసైడ్ చేసుకుంటా.

రమ్య టాపిక్ డైవర్ట్ చేసింది.

"అసలు వాళ్లంతా కలిసి చేసిన కోల్డ్ బ్లడెడ్ మర్డర్ కి కోర్ట్ హాల్లోనే    షూట్ చేసి పారేయాలి. బట్ మనం ఖర్మ భూమిలో వున్నాం.. భర్త అత్తా మామలతో బాటు    ఇంజినీరింగ్ ఆఘోరిస్తున్న ఆడ పడుచుకీ బురద పందికీ..ఐమీన్ మరిది పందికీ సెవెనియర్స్ ఖఠిన కారాగార శిక్ష విధించారు..ఫేమిలీ ఫేమిలీ మొత్తం చిప్ప కూడు తింటూ బతికేయొచ్చు. అసలిలాంటి నీతి మాలిన కేసును డీల్ చేయడానికి ఒప్పుకున్న మా మేడంని చెప్పుతో కొట్టాలి.'

ఇది బావా కథ. బై ద బై రేపు మార్నింగ్ ఫ్లైటుకు మీరు ఎయిర్ పోర్ట్ లో డ్రాప్ చేయ గలరా..ఇందాక నన్ను డ్రాప్ చేసిన టేక్సీ వాలాని కాంటాక్ట్ చేయనా.

మీ బావ గారి ఫ్రెండ్సందరికీ కార్లున్నాయ్. అందాల లాయర్ మరదలికి ఈమాత్రం బిస్కెట్ వేయని బావలు ఈ కంప్యూటర్ యుగంలో వున్నారంటే ఐ డోంట్ బిలీవ్..నువ్వు డిన్నర్ మెనూ డిసైడ్ చేయి తల్లీ ఆ తిప్పలేవో మీ బావే చూసుకుంటారు.

చిలిపిగా అంటించిన చురకలు చుర్రుమన్నా నోరు తెరిస్తే ఇంకెన్ని చురకలు చుక్కలు చూపిస్తాయోనన్న భయంతో ఫ్లైట్ టైమింగ్ కోసం గన్నవరం ఎయిర్ పోర్ట్ ఎంక్వైరీ నెంబర్ కోసం లాప్ టాప్ లో ముఖం దాచుకున్నాడు..ద గ్రేట్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయి ..రమేష్ బాబు.

** ***

వారం తర్వాత అక్క నుంచి వచ్చిన వాట్స్ యాప్ మెసేజ్ లోని మొదటి సెంటెన్స్ చూస్తూనే యురేకా అని అరవబోయి ..తనున్నది కోర్టులోనని గుర్తు తెచ్చుకొని తమాయించుకుని సెల్ ఫోన్ స్క్రీన్ కు కళ్లప్పగించేసింది ..దివ్య.

దివ్యా! యువార్ గ్రేట్..బావ యిష్యూ చెప్పినప్పుడు నువ్వన్నమాట ..నీకు గుర్తుందా..మై హూనా అని. యస్ అది వర్డ్ కాదు జడ్జ్ మెంటని ప్రూవై పోయింది.

నీ రాకకు ముందు నేను మా కంపెనీలోనే..టీమ్ లీడర్ని. నువ్వు వచ్చి వెళ్లాక అత్తా మామ..మరిదీ మరదలు..ఇంక్లూడింగ్ యువర్ బావ గ్రూప్ కు నేనే...

లీడర్ని.. నా అనుమతి లేకుండా ఎలాంటి ఈవెంటూ నహీ హోతా.. ఇప్పుడు మా యింట్లో "ఐ "అనే అక్షరమే బేన్డ్ .. హం ఫెస్టివల్కు నహీ...ఆరా..నా ప్రియమైన చెల్లికి ..లక్ష ముద్దులలో అక్క.

అమ్మా నాన్నలకు అక్క ముద్దులందించాలని..అరవై కిలోమీటర్ల స్పీడులో దూసుకు పోయింది ..అమ్మాయిల కేసులు తప్ప అన్యాయపు కేసులు వాదించనని.. నిర్ణయం తీసుకున్న నేటి జనరేషన్ అమ్మాయి..లాయర దివ్య..లవ్ లీ సిస్టర్ ఆఫ్ రమ్య*




"డాక్టర్...ఎలాగైనా నా భార్యా బిడ్డలను కాపాడండి. వారు తప్ప ఈ ప్రపంచంలో నాకు ఇంకెవరూ లేరు" ఏడుస్తూ చెప్పాడు గణేష్.

"చూడండి మిస్టర్. గణేష్...దాని కోసమే ఒక ప్రత్యేక డాక్టర్ల బృందం నిన్నటి నుండి క్రుషి చేస్తున్నారు. కానీ మీ భార్య ఆరోగ్యంలో కొంచం కూడా మార్పు కనిపించడంలేదు. మీ భార్య కేసును మేమంతా ఒక చాలెంజ్ గా తీసుకున్నాము. నిజానికి ఇప్పుడు జరుగుతున్నది వైద్యానికి-విధికి మధ్య యుద్ధం. వైద్యం మూలంగా విధిని జయించటానికి నగరంలోని డాక్టర్లంతా ఒకటయ్యారు. మీ భార్య కేసులో ఎటువంటి ట్రీట్ మెంట్ చేస్తే తల్లీ-బిడ్డను కాపడవచ్చుననే విషయంపై వైద్య సముదాయమే పుస్తకాలు తిరగేస్తున్నది...కాబట్టి మీరు కొంచం రిలాక్స్డ్ గా ఉండండి...మమ్మల్ని రిలాక్స్డ్ గా ఆలోచించుకోనివ్వండి. నెగటివ్ గా ఆలొచించి మీ మనసు పాడుచేసుకోకండి. తల్లీ-బిడ్డ క్షేమంగా ఈ ప్రపంచాన్ని చూస్తారని నమ్మకంగా ఉండండి" అన్నాడు డాక్టర్.

"ఎలా ఉండగలను డాక్టర్? వైద్యానికీ-విధికీ మధ్య యుద్ధం జరుగుతున్నదని మీరే చెబుతున్నారే! దానికి అర్ధమేమిటి డాక్టర్? వైద్యం కంటే విధి బలంగా ఉన్నదనేగా అర్ధం...వైద్యులైన మీరే ఆ మాట చెబితే...మామూలు మనుష్యులమైన మేమంతా ఏమై పోవాలి చెప్పండి"

“అందుకని మీతో అబద్ధం చెప్పమంటారా? పేషంట్ల దగ్గర నిజాలు దాచకూడదనేది మా వృత్తి దర్మం. అందుకని నిజమే చెబుతున్నా...వైద్యం కంటే విధియే గొప్పది, డాక్టర్ల కంటే దేముడే గొప్ప...మేము నిమిత్త మాత్రులమే. ఒక రోగిని రక్షించడం-తీసుకు పోవడం మా కంటే గొప్పవాడైన ఆ దేముడే చేయగలడు...కానీ ఆ పనికి డాక్టర్లైన మమ్మల్ని ఉపయోగించుకుంటున్నాడు. వైద్య పరంగా ఎలాంటి ట్రీట్ మెంట్ ఇవ్వాలో రోగికి అవన్నీ చేస్తూనే ఉంటాము...అయినా రోగి ఆరోగ్యంలో కొంచం కూడా మార్పు రాకపోవడమే కాకుండా అనుకోని మరికొన్ని ఆనారోగ్య పరిస్థితులు ఎదురైతే మేము మాత్రం ఏమి చెయ్యగలం" అని చెప్పేసి వేగంగా వెళ్ళిపోయాడు డాక్టర్.

డాక్టర్ చెప్పింది విని "భగవంతుడా...నా భార్యాబిడ్డలను కాపాడు" అని మనసులోనే భగవంతుడిని ప్రార్ధిస్తూ భారమైన మనసుతో అక్కడే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు గణేష్.

అప్పుడే హాస్పిటల్లోకి క్యారేజీతో వచ్చిన ఒక ముసలమ్మ గణేష్ దగ్గరకు వచ్చి, అతని పక్కనే ఉన్న కుర్చీలో కూర్చుని "ఏం నాయనా...డాక్టర్లు ఏం చెబుతున్నారు" అని అడిగింది.

గణేష్ కళ్ళు తుడుచుకుంటూ “సరిగ్గా చెప్పటంలేదు బామ్మగారు... వాళ్ళ ప్రయత్నాలు వాళ్ళు చేస్తున్నారట" పొంగుకొస్తున్న ఏడుపును దిగమింగుకుంటూ చెప్పాడు గణేష్.

“నువ్వేమీ బాధ పడకు నాయనా...ఆ దేముడు నీకు అన్యాయం చేయడు...నీ ఇష్ట దైవాన్ని మొక్కుకో...అంతా మంచే జరుగుతుంది. ఇదిగో నీ కోసం క్యారేజీ తెచ్చాను ...కాస్త ఎంగిలిపడు" గణేష్ కి ధైర్యం చెబుతూ చెప్పింది బామ్మగారు.

"వద్దు బామ్మగారు...నాకు ఏమీ తినాలనిపించడం లేదు. నన్ను బలవంతం చేయకండి" అన్నాడు.

ఈ లోపు ల్యాబర్ వార్డ్ డోర్ తెరుచుకోవడంతో అటువైపు చూసాడు గణేష్.

డాక్టర్ బయటకు వచ్చాడు. తిన్నగా గణేష్ దగ్గరకు వచ్చేడు. గణేష్ లేచి నిలబడ్డాడు “సారీ గణేష్...తల్లీ బిడ్డలలో బిడ్డను మాత్రమే కాపాడ గలిగాము" అని చెప్పాడు.

ఆ మాట విన్న గణేష్ తలపట్టుకుని అక్కడున్న కుర్చీలో కూలబడ్డాడు.

****************

పదిహేను రోజుల నుండి గణేష్ తిండి-నిద్రలకు దూరమవడం వలన బాగా చిక్కిపోయాడు.

గదిలో కట్టిన గుడ్డ ఉయ్యాలలో పసి పిల్ల హాయిగా నిద్రపోతోంది.

గోడను ఆనుకుని కన్నీరు మున్నీరుగా ఏడుస్తూ కూర్చున్న గణేష్ కి ఎదురుగా ఉన్న దేవుని ఫోటో కనబడింది. మెల్లగా లేచి ఫోటోకు ఎదురుగా నిలబడ్డాడు.

"నాకెందుకు ఇంత పెద్ద శిక్ష వేసావు. నేనూ, నా భార్య ప్రతిరోజూ నీకు పూజలు చేసామే... వారానికొకసారి నీ గుడికి వచ్చి నిన్ను దర్శించుకుని మమ్మల్ని దీవించమని, ఎవరూ లేని మాకు నీవే దిక్కు అని వేడుకున్నామే.... నువ్వు మాకు తోడుగా ఉంటావనే ధైర్యంతో మేము మా బాధలన్నీ మర్చిపోయి ఆనందంగా మా జీవితాన్ని గడుపుతున్నామే...అలాంటి మాకు నువ్వెందుకింత అన్యాయం చేసేవు...నాకెందుకింత కష్టాన్ని ఇచ్చావు...మాకు తోడుగా ఉండమని మాత్రమే నిన్ను వేడుకున్నామే తప్ప, ఇంకేమీ నిన్ను అడగలేదే? ఎలాంటి వరమూ కోరుకోలేదే? అలాంటి నాకు ఎందుకింత పెద్ద శిక్ష వేసావు....నా అన్న వాళ్ళందరినీ వదులుకుని, నువ్వున్నావనే నమ్మకంతో పెళ్ళి చేసుకున్న నాకు ఈ బిడ్డను వరంగా ఇచ్చి, నా భార్యను నా నుండి, ఈ పసి బిడ్డ నుండి వేరు చేసి నీ దగ్గరకు తీసుకెళ్ళావే...తల్లి లేని బిడ్డను ఎలా పెంచగలననుకున్నావు?...అది సాధ్యమేనా?..." అంటూ దేమున్ని నిలదీస్తున్న గణేష్ కి ఉయ్యాలలో పడుకున్న బిడ్డ ఏడుపు వినిపించింది.

బిడ్డ దగ్గరకు వెళ్ళాడు. బిడ్డ ఏడుపు పెద్దదయ్యింది.

తిండి-నిద్రలకు గణేష్ దూరమయ్యాడు గానీ ఆ పసి బిడ్డ ఆ రెండింటికీ దూరమవగలదా! ఆకలేసి పాలకు ఏడుస్తోందని గ్రహించాడు. ఉయ్యాలలో ఉన్న, పుట్టి పదిహేనురోజులే అయిన ఆ ఆడపిల్లను చేతులలోకి తీసుకుని, గుండెలకు హత్తుకుని, పక్కనే టేబుల్ మీద పెట్టిన పాల సీసాను తీసుకుని సీసా పీకను బిడ్డ నోటికి అందించాడు.

పుట్టిన క్షణం నుండి తల్లి పాలే తాగని ఆ బిడ్డకు సీసా పాలు పడుతుంటే అతని గుండె బాధతో గిలగిలా కొట్టుకుంది.

పాల బాటిల్లో ఒక చుక్క పాలు కూడా మిగల్చకుండా పాలు తాగిన బిడ్డను మళ్ళీ ఉయ్యాలలో పడుకోబెట్టి, ఆ ఉయ్యాలను ఊపాడు. ఆ పసికందు మెల్లగా నిద్రలోకి జారుకుంది.

అంతవరకు బిడ్డ ధ్యాసలో ఉన్న గణేష్ ని తిరిగి ఆలొచనలు చుట్టు ముట్టినై. ఈ సారి ఆ ఆలొచనలు అతన్ని పాత జ్ఞాపకాలలోకి తీసుకువెళ్ళినై.

***************************

పొట్ట కూటికోసం గ్రామం నుండి నగరానికి వచ్చాడు గణేష్.

నగరంలో రకరకాల ఉద్యోగాల కోసం ప్రయత్నించిన అతనికి చివరికి డ్రైవర్ ఉద్యోగం దొరికింది. అది కూడా ట్రావల్స్ కంపెనీలో. వాళ్ళిచ్చే జీతం అతనికి సరిపోతోంది. జాగ్రత్తగా ఖర్చులు పెడుతూ జీవితం కొనసాగిస్తున్న అతనికి అదే ట్రావల్స్ లో క్లర్క్ గా పనిచేస్తున్న మాధవితో స్నేహం ఏర్పడింది. స్నేహం ప్రేమగా మారింది. రెండు కుటుంబాల వారూ వారి పెళ్ళికి ఒప్పుకోలేదు. అందరినీ ఎదిరించి ఇద్దరూ పెళ్ళి చేసుకున్నారు.

ఊరు చివర ఉన్న ఒక చిన్న పూరిగుడిసలో అద్దెకు దిగారు. ఆ ఇంటి యజమానురాలు డెబ్బై సంవత్సరాల ముదసలి. ఆవిడ్ని బామ్మగారు అని పిలిచేవారు. గణేష్-మాధవి దంపతులకు బామ్మగారు మాత్రమే చుట్టం.

గణేష్-మాధవి ఇద్దరూ ఉద్యోగానికి వెళ్ళి సంపాదించుకుంటున్నా వాళ్ళిద్దరి సంపాదనా వాళ్ళకు సరిపోయేది కాదు. అయినా తమ ఆశలను చంపుకుని ఉన్నదాంట్లోనే జీవితాన్ని ఆనందంగా గడుపుకుంటూ "మంచి రోజులు రాకుండా పోతాయా" అనుకుంటూ హాయిగా జీవించారు. దానికి ముఖ్య కారణం మాధవి. వచ్చే సంపాదనను ఆచితూచి ఖర్చుపెడుతూ "అప్పు" అనే మాటకు చోటిచ్చేది కాదు.

తనకు ఎంతో పక్క బలంగా ఉండే మాధవి ఇప్పుడు లేదు. చల్లటి గాలిలా తన జీవితంలోకి వచ్చిన మాధవి తుఫానులా మాయమైపోయింది. మొదటి కానుపుకు వెళ్ళిన మాధవి మరు జన్మ ఎత్తలేదు. తన ప్రాణాన్ని బిడ్డకు ఇచ్చేసి కనబడకుండా పోయింది.

తలచుకుంటున్న కొద్దీ గణేష్ కి ఏడుపు ఎక్కువవుతోంది. మనసు భారంతోనూ, శరీరం నీరసంతోనూ ఉండటంతో గోడ పక్కనే నేల మీద పడికుండిపోయాడు.

"ఏం నాయనా... ఉన్నావా...బిడ్డ ఏడుస్తున్నది కూడా వినబడలేదా...ఇలా అయితే ఎలా?...ఆ బిడ్డని నువ్వు కంటికి రెప్పలా కాపాడుతావనే నమ్మకంతోనే మాధవి ఆ బిడ్డను నీకిచ్చి వెళ్ళిపోయింది. నువ్వు ఇంట్లోనే ఉంటే ఎలా చెప్పు. ఉద్యోగానికి వెళ్ళి సంపాదించుకుని వస్తేనే కదా నీ భార్య ఆశను నెరవేర్చ గలవు...ఆ బిడ్డనూ, పాల బాటిల్నూ, పాల పొడిని నాకిచ్చి నువ్వు ఉద్యోగానికి వెళ్ళు. నువొచ్చేదాకా నీ బిడ్డను నేను చూసుకుంటా" అని చెప్పి గణేష్ మాటలకు ఎదురుచూడకుండా ఉయ్యాలలో ఏడుస్తున్న పసి బిడ్డను తీసుకుని పాల బాటిల్నూ, పాల పౌడర్ ను ఒక సంచిలో వేసుకుని వెళ్ళిపోయింది పక్కింటి బామ్మగారు.

"నిజమే...భార్యకు నొప్పులు ఎక్కువ అయిన రోజు నుండి ఈ రోజు వరకు నేను ఉద్యోగానికి వెళ్ళలేదు...వెళ్ళాలి" అనుకున్న వెంటనే ఓపిక తెచ్చుకుని, స్నానము ముగించుకుని డ్యూటీకి బయలుదేరేడు గణేష్.

డ్రైవింగ్ చేస్తున్న గణేష్ కి మనసంతా బిడ్డ మీదే ఉన్నది. "బిడ్డను బామ్మగారు చూసుకుంటోందిగా" అనే ఆలొచన అతన్ని మామూలు జీవితంలోకి తెచ్చింది. కారు నడుపుతున్న అతనికి రోడ్డు మీద ఒక ముసలాయన కారుకు అడ్డంగా రోడ్డు దాటడం కనిపించింది. సడన్ బ్రేకు వేసాడు. అదృష్టం కొద్ది కారు ముసలాయన దగ్గరవరకు వచ్చి ఆగింది. ఒక్క నిమిషం తన ప్రాణం పోయి వచ్చినట్లు అయ్యింది గణేష్ కి.

అక్కడి నుంచి బయలుదేరిన గణేష్ కి చేతులు కొంచం వొణకడంతో, కారును ట్రావల్స్ లో వదిలేసి మధ్యలోనే ఇంటికి వచ్చేసాడు. బామ దగ్గరున్న తన బిడ్డను తీసుకు వచ్చి గుడ్డ ఉయ్యాలలో పడుకోబెట్టాడు.

ఓపికేలేని తాను కూడా గోడకానుకుని కూర్చున్నాడు. ఆలొచనలు అతన్ని వెన్నంటినై. "ఒక వేల కారు ముసలాయనను గుద్దుంటే, జరగకూడనిది జరిగుంటే...అప్పుడు ఈ బిడ్డ గతి! ఆడబిడ్డ ఈ సమాజంలో తల్లీ-తండ్రీ లేకుండా బ్రతకగలదా?" ఆలొచిస్తున్న గణేష్ కి ఏదో పరిష్కారం దొరికినట్లు "అంతే...అలాగే చెయ్యాలి" అనిపించడంతో నిద్రలోకి జారుకున్నాడు.

**********************

"గణేష్...నీ నిర్ణయాన్ని మార్చుకో"

"మార్చుకోను...ఎవరు చెప్పినా మార్చుకోను...నేను తీసుకున్న నిర్ణయం సరైనదే"

"ఇదేనా నువ్వు నీ భార్యకు ఇచ్చే గౌరవం? నీ మీద ఎంత నమ్మకముంటే బిడ్డని నీకిచ్చి వెడుతుంది. అలాంటి భార్యను నీచమైన నీ ఆలొచనలతో అవమానిస్తున్నావు!...ఈ విషయం ఎందుకు ఆలొచించవు?"

"ఎందుకు ఆలొచించలేదు...బాగానే ఆలొచించాను...బిడ్డని నాకిచ్చి వెళ్ళిపోయింది మాధవి కాదు...బిడ్డని నాకిచ్చి నా భార్యను తీసుకు వెళ్ళింది ఆ భగవంతుడు. అలాంటి భగవంతుడితో ఎంత మొరపెట్టుకున్నా ఏమీ ప్రయోజనం లేకపోయింది. మొగవాడినైన నేను ఆ పసి బిడ్డను ఎలా పెంచను...అందులోనూ ఆడ పిల్ల. నేను చేసే ఉద్యోగంలో నాకు ఎప్పుడైనా, ఏదైనా జరగవచ్చు. అప్పుడు ఈ పిల్ల గతి ఏంకాను....అందుకే ఆ బిడ్డను భగవంతుడి దగ్గర వదిలిపెట్టేస్తాను. అ బిడ్డ బాగోగులు ఆ భగవంతుడే చూసుకుంటాడు...నా కళ్ళకు నా బిడ్డ కనిపించదు కాబట్టి, ఎక్కడో ఒక చోట ఆనందంగా పెరుగుతోందని సంతోషిస్తూ జీవితం గడిపేస్తాను"

“ఆపు నీ పిచ్చి మాటలు. నీ బిడ్డను నువ్వే పెంచలేనప్పుడు, ఇంకెవరో బాగా పెంచుతారని ఎలా అనుకుంటున్నావు. అనాధ పిల్లలను ఎన్ని అగచాట్లకు గురి చేస్తున్నారో నువ్వెప్పుడూ వినలేదా? బిడ్డలను అనాధ ఆశ్రమాల నుండి ఎత్తుకు పోయేవారు కొందరైతే, అనాధ ఆశ్రమాలే బిడ్డలను డబ్బుకు అమ్ముకుంటున్నారని నువ్వు వినలేదా? అలాంటి బిడ్డలను ఎటువంటి నీచ కార్యాలకు

ఉపయోగించుకుంటున్నారో నీకు తెలియదా? అందులోనూ ఆడపిల్ల...ఆడపిల్లలకు జరుగుతున్న అన్యాయాలను నువ్వెప్పుడూ వినలేదా? అలాంటి గతి నీ బిడ్డకు పట్టాలని అనుకుంటున్నావా?”

"వద్దు...వద్దు. భయంకరమైన వార్తలను చెప్పి నా మనసును పాడుచేయకు...ఏ తోడు లేకుండా ఆడపిల్లను నెనొక్కడినీ ఎలా పెంచగలను"

"నారు పోసినవాడే నీరు పోస్తాడనే సామెత నువ్వెప్పుడూ వినలేదా"

"ఈ సామెతలన్నీ చెప్పుకోవడానికే పనికొస్తాయి. అంత కష్టాన్ని నాకెందుకివ్వడం...ఆ తరువాత ఎందుకు నీరుపోయడం. ఏం తప్పుచేసేనని నా భార్యను నా నుండి విడదీసేడు...సరే, నా సంగతి వదిలేద్దాం...ఈ పసిపాప ఏం తప్పు చేసింది. లోకాన్ని ఈ మధ్యే చూసిన ఈ పసిపాప చేసిన తప్పేమిటో... ఈ పసిపాపను తల్లికి ఎందుకు దూరంచేయడం...నా భార్య ఏం తప్పుచేసిందని తన దగ్గరికి తీసుకుపోయాడు"

"నువ్విప్పుడు ఎదొర్కొంటున్న కష్టాలకు ఆ భగవంతుడే కారణమని న్యాయపరచుకుంటూ వెడితే...నీకు నేనేమీ చెప్పలేను. కానీ ఒకటి మాత్రం గుర్తుచేస్తాను. బంధాలు బాధ్యతలను గుర్తుచేయటానికే ఏర్పడతాయి. బుద్ధి కర్మానుసారిణీ... అంటారు. అంటే గతజన్మ కర్మఫలం మనిషిని నడిపిస్తుంది. ఎన్నో పుణ్యకార్యాలు చేస్తున్నప్పటికీ కష్టాలు పడుతున్నవారు పూర్వ జన్మలో ఇంతకుమించిన పాపఫలాన్ని మూటగట్టుకున్నారని అర్థం. ఇప్పుడు దుష్కర్మలు ఆచరిస్తూ కూడా సుఖంగా జీవిస్తున్న వారు గత జన్మలో సత్కార్యాలు చేసి ఉంటారు. కానీ పైజన్మకు మోయలేనంత పాపభారాన్ని సిద్ధం చేసుకుంటున్నారని వారికి తెలియదు. ఈ కర్మఫలాన్ని నిష్పక్షపాతంగా ఇవ్వడమే భగవంతుడు చేస్తున్న పని. కానీ పాపపుణ్యాల తేడా తెలుసుకుని విచక్షణా జ్ఞానంతో ప్రవర్తించగలిగే అవకాశం, శక్తి, దేవుడు మనిషికి మాత్రమే ఇచ్చాడు. అందుకే ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా ఈ జన్మలో సత్కార్యాలు చేస్తే మరుజన్మకు పుణ్యం సంపాదించుకో గలవు.. నువ్వు చేసే తప్పొప్పులకు పూర్తి బాధ్యత నీదే...." .

"ఆపు నీ ఉపదేశాలు" అరుస్తూ నిద్ర నుండి గబుక్కున లేచేడు. చుట్టూ చూసాడు. "ఇంతసేపు నేను కలలోనా మాట్లాడింది" అనుకుంటూ టేబుల్ మీదున్న అలారం గడియారం వైపు చూసాడు. మధ్య రాత్రి రెండు గంటలు దాటింది...ఒకసారి ఉయ్యాలవైపు చూసి మళ్ళీ పడుకున్నాడు గణేష్.

***************************

మరుసటి రోజు ఉగాది. ఊరంతా పండుగ వాతావరణం అలుముకొంది. బిడ్డకు స్నానం చేయించి తన దగ్గరున్న పంచ తీసి బిడ్డ మీద కప్పేడు గణేష్. బిడ్డ నుదుటిపైన, బుగ్గలపైన ముద్దుల వర్షం కురిపించాడు.

"కళ్ళ వెంట నీరు కారుతుంటే నన్ను క్షమించు బంగారం. నాకు దీనికంటే వేరే మార్గం తెలియటం లేదు. ఈ తండ్రిని క్షమించు తల్లీ" అంటూ ఏడ్చా డు.. చీకటి తొలగి, వెలుతురు బయటకు వస్తున్న తెల్లవారు జామున బిడ్డతో పాటు ఊరు చివరికి వెళ్ళాడు గణేష్. అక్కడున్న చెత్త కుండీ వైపుకు పిల్లిలాగా మెల్లగా నడిచాడు...సన్నగా బిడ్డ ఏడుపు వినబడింది...

భయపడ్డాడు. అటూ, ఇటూ చూసాడు. ఎవరూ లేరని గుర్తించి, చేతిలోని బిడ్డ ముఖంపై కప్పి ఉన్న పంచను కొంచంగా తొలగించాడు.     బిడ్డ మంచి నిద్రలొ ఉన్నది..."మరి ఏడుపు వినబడుందే... దీనినే భ్రమ అంటారేమో"     అనుకుంటుండగా మళ్ళీ సన్నగా బిడ్డ ఏడుపు వినబడింది. కంగారు పడ్డ గణేష్ అటు, ఇటూ చూసేడు. ఎవరూ కనిపించలేదు.

"మరి ఆ ఏడుపు...ఏడ్చేది తన బిడ్డ కాదు...భ్రమ అంతకంటే కాదు" అనుకుంటూ ఆయోమయ పరిస్థితులలో ఉన్న గణేష్ కు మళ్ళీ అదే ఏడుపు వినిపించింది.

ఆ ఏడుపు చెత్త కుండీ పక్క నుంచే వస్తోందని గ్రహించిన గణేష్ మెల్లగా చెత్త కుండీలోకి తొంగి చూసేడు. లోపల ఒక గుడ్డ మూటను ఒక కుక్క నోటిలో లాగుతోంది. గుడ్డ మూటంతా ఎర్రగా ఉంది.

"చీ...చీ..." అంటూ కుక్కను తరిమి కొట్టాడు. గుడ్డ మూటను చేతిలోకి తీసుకున్నాడు. మళ్ళీ అదే ఏడుపు. ఆ గుడ్డ మూటలో నుండే. గబగబా గుడ్డమూటను విడదీసాడు. ఆశ్చర్యపోయాడు. అందులో అప్పుడే పుట్టిన బిడ్డ నెత్తుటి గుడ్డులాగా ఉంది. అదే గుడ్డతో ఆ బిడ్డ శరీరం తుడిచాడు. అదొక ఆడపిల్ల. "నేనే గనుక ఈ బిడ్డను చూసుండకపోతే?... ఈ బిడ్డ ఇంకొద్దిసేపట్లో ఆ కుక్కకు ఆహారం అయ్యుండేది... ఈ బిడ్డను నేను చూసుండకపోతే? నా బిడ్డను కూడా....." భయంతో కంపించిపోయిన గణేష్, వొణుకుతున్న చేతులలో, తల్లి ప్రేమతో ఆ పసి బిడ్డను ఎత్తుకున్నాడు. నుదిటి మీద ముద్దు పెట్టాడు. రాత్రి కలలో కనిపించి బాధ్యత గురించి చెప్పినతని మాటలు గుర్తుకు వచ్చేయి....అంతే....అతనిలో తెలియని ఆనందం చోటుచేసుకుంది.

"ఇక మీదట నాకు ఇద్దరమ్మాయిలు" అనుకున్న గణేష్ కి ఏనుగంత బలం వచ్చింది. ఉగాది బహుమతిగా దొరికిన పసికూనలను రోజా పువ్వుల్లాగా మెల్లగా తన హృదయానికి హత్తుకుని, నమ్మకంతో ఇంటివైపుకు నడక సాగించాడు గణేష్.




"ఈ ప్రపంచంలో లంచాలతో సాధ్యం కాని పనంటూ ఏమీ ఉండదు. అయితే లంచాలు గ్రహించే వారు వాళ్ళ జీవితాలను పణంగా పెట్టి అసాధ్యమైన పనులను కూడా ఒప్పుకోవాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను ఎంత కూకటి వేళ్ళతో పెళ్ళగించి పారేయాలన్నా బొమ్మజెముడు చెట్టులా లోపలనుండి వేళ్ళూనుతో చుట్టుపక్కలకు వ్యాపిస్తూనే వుంటుంది. " అంటూ లంచాల గురించి అనర్గళంగా చెప్తూ ఉంటాడు స్వామిరావు

ప్రపంచంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న కరప్షన్ గురించి అతను విచిత్రంగా భాష్యం చెప్తూ ఉంటాడు. లక్షలు , కోట్లు లంచం రూపంలో తెగమేసే వాళ్ళని పక్కన పెడితే లంచాన్ని ప్రధానంగా మూడు రకాలుగా చెప్పు కోవచ్చుట. మొదటిది సాధారణ నగదు సేవలు. ఇది ఆషామాషా వ్యవహారం కాదు. రెండో కంటికి తెలియకుండా పనులు చక్క పెట్టుకోవడమో, లేదా పై వాళ్ళను కూడా భాగస్తులుగా చెయ్యడమో తెలిసివుండాలి. రెండవది వస్తు సేవలు. మన పేరుమీద మన వల్ల లాభించిన వాళ్ళు గుట్టు చప్పుడు కాకుండా ఏ టీవీనో, ఏసీనో కొనేసి ఆ బిల్లు మనకు ఇవ్వడం లేదా మనం కోరుకునే ఏ వస్తువునైనా వాళ్లకు కాని, మనకు కాని ప్రమాదం లేకుండా ఆఫర్ చెయ్యడం లాంటి దన్న మాట. మూడవది ఇతర సేవల కింద వస్తాయి. పుణ్య క్షేత్రాలకు వాహనాలు సమకూర్చడం, ఏదైనా స్టార్ హోటల్లులో రూములు బుక్ చేసి పెట్టడం లాంటివి ఈ కోవకిందే వస్తాయిట.

అవకాశాలు దొరికినంత మేరకు పాత ఉద్యోగంలో అన్ని వస్తువులు బాగానే అమర్చుకున్నాడు స్వామి రావు. అదృష్ట వంతులను చెడగొట్ట లేరన్నట్టు ఈ మధ్యనే అతనికి ఒక పెద్ద కంపెనీలో సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ గా పోస్టింగ్ వచ్చింది. చేరిన

కొత్తలోనే తన లంచ శాస్త్ర ప్రావీణ్యాన్ని చూపిస్తే ప్రమాదమనీ, ముందుగా మున్ముందుగా అక్కడి వాతావరణాన్ని, మనుషులను నిశితంగా పరిశీలించాడు స్వామీరావు. అతని కన్నా ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్లు తనలాంటి ప్రబుద్ధులు అక్కడ చాలా మంది ఉన్నారు.

“చూడండి మిస్టర్ స్వామి రావు గారూ ఇకనుండి మన ప్రోడక్ట్ థర్డ్ పార్టీ వాళ్ళు ఇన్స్పెక్షన్ చెయ్యాల్సి ఉంటుంది. మన వస్తువుల నాణ్యత ఏమిటో మనకు తెలియంది కాదు. బయట పార్టీల వాళ్ళొచ్చి తనిఖీలు ప్రారంబిస్తే ఒక్క కేజీ ప్రోడక్ట్ కూడా బయటకు పోదు. ఇలాంటి విపత్కర పరిస్తితిలో మీ తెలివి తేటలను, చాకచక్యాన్ని ఉపయోగించి వాళ్ళను నమ్మించి , బాగా తాగించి గెస్ట్ హౌస్ లో బాగా మేపి డబ్బుల కట్టలు ఆశ చూపించి, వాళ్ళ సంతకాలు తీసుకుని సరుకును బయటకు పంపటానికి మార్గాన్ని సుగమం చెయ్యండి ఈ విషయంలో రాజీ పడవలసిన అవసరం లేదు .

మళ్ళీ చెపుతున్నాను. వాళ్లకు బాగా తినిపించండి. మీకు కావాలిసినంత తినండి పని మాత్రం జరగాలి “ అంటూ ఆర్డర్ వేసాడు అతని పైన డైరెక్టర్ ఒకరోజు స్వామి రావును తన ఛాంబర్ లోకి పిలిచి. అనుకున్నట్టే ఇన్స్పెక్టర్స్ వచ్చారు. వాళ్ళ కోసం కిలోల కొద్దీ నేతిలో వేయించిన జీడిపప్పు క్షణాల్లో ఖర్చైపోయింది. మామిడి పళ్ళ సీజన్లో వచ్చారో ఏమిటో ఒక్కొక్కళ్ళకు ఏభై పళ్లకు తగ్గకుండా విడివిడిగా బుట్టలు ప్యాక్ అయి పోయాయి. దాంతో పాటు కొత్త కరెన్సీ నోట్లు పంచబడ్డాయి. ప్రోడక్ట్ చూడకుండానే రాత్రికి రాత్రి సంతకాల కార్య క్రమం విజయవంతంగా ముగిసింది. వాళ్ళతో పాటు స్వామీ రావు కూడా సునాయాసంగా డబ్బులు చేసుకున్నాడని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అదేమిటో గాని స్వామి రావు ఏ కంపెనీ కెళ్ళినా అతని అదృష్టం గిర్రున తిరుగులోంది.

ఈ లోపు కొత్తావకాయ సీజన్ వచ్చింది. స్వామీ రావు కెందుకో దానిమీద అంత పెట్టుబడి పెట్టటానికి మనసొప్పలేదు. అయినా అతనిలో లాభ పడ్డ వాళ్ళు ఊరుకుంటారా ? సామర్ల కోట నుండి ఐదు కిలోల పప్పు నూనె, గూడెం నుండి ఎర్రటి కారంతో పాటు మాంచి టెంక పట్టిన మామిడి కాయలు, ఇతర దినుసులు అతని వాకిట్లో తెచ్చి పడేసారు. అతను కోరుకునేది ఏమీ లేదు. నోటిలోంచి మాట రాకుండానే అతని ముఖ భావాలు పసిగట్టి ఆయా పనులు జరుపుకుంటూ పోయేవాళ్ళు అతని కస్టమర్లు. పులి మనిషి రక్తం మరిగితే ఎలా విచక్షణారహితంగా తిరగబడుతుందో

స్వామీరావు విషయంలోనూ అదే జరుగులోంది.

స్వామీరావు తో బాగా లాభపడిన ఒక కస్టమర్ అతన్ని పర్సనల్ గా కలుసుకోవడానికి అనుమతి అడిగాడు. .“నేను చెప్పే అంత వరకు కొన్నాళ్ళు నన్ను డైరెక్ట్ గా కలవడానికి ప్రయత్నం

చెయ్యకండి. నేనంటే గిట్టని వాళ్ళు నా మీద నిఘా పెట్టారు. ఇది మీకూ, నాకూ కూడా మంచిది కాదు " అంటూ అతన్ని బలవంతంగా పంపించే ప్రయత్నం చేసాడు స్వామీరావు.

"మీరు అలా అనకండి సార్. నేనో పెద్ద టెండర్ వేసాను. ఎలాగైనా అది నాకు రావాలని ఆశిస్తున్నాను. నేనిప్పుడు కాని వెనకడుగు వేసానంటే నా జీవితంలో అంత పెద్ద ఆఫర్ వస్తుందన్న నమ్మకం లేదు.

మీరెలాగైనా నా పని చేసిపెట్టాలి. మీకే సమస్య రాకుండా నేను చూసుకుంటాను. నాది భాద్యత. " అంటూ ఆ సేట్ చాలా సేపటివరకు అక్కడనుండి కదలలేదు.

"ఏమిటి ఈ మధ్య కాళ్ళ దగ్గరకొచ్చిన అదృష్టాన్ని చెడగొట్టు కుంటున్నారుట ?. మీది రాజా లాంటి ఉద్యోగం అందరకి ఇటువంటి అవకాశాలు రావు. ఇప్పటికి ఐదారు కంపెనీలలో చేసారు. ఎక్కడైనా సమస్య వచ్చిందా ? ఎవరైనా పట్టుకున్నారా ? మీది పూర్తి ప్రైవేటు సంస్థ. పైన్నుండి వల వేసి పట్టుకునే వాళ్ళు ఎవరూ ఉండరు. ఇక్కడ ఎవరి బలం వాళ్ళు చూసుకుంటారు. అన్నట్టు ఆ సేట్ను నిర్దాక్షిణ్యంగా పంపించేసారుట? అతను మన ఇంటికి వచ్చి నా కాళ్ళా వేళ్ళా పడ్డంత పని చేసాడు. ఎలాగైనా అయ్యగారిని మీరే ఒప్పించి నా పని చక్కబెట్టాలి అంటూ కళ్ళనీళ్ళు కూడా పెట్టుకున్నాడు. ఒక్కటి మాత్రం గుర్తు పెట్టుకోండి. మనకు ముగ్గురు ఆడపిల్లలు. ఇప్పటికే వాళ్ళ చదువులకు తడిసి మోపెడంతయ్యింది. రేపు వాళ్ళ పెళ్ళిళ్ళు ఎలా చేస్తాం.? అసలే మీరు మంచి పొజిషన్లో ఉన్నారు. పెళ్లి లేకిగా చేసేస్తే బాగుండదు...... " అంటూ ఆగింది స్వామీరావు భార్య ఒకరోజు..

"నీ ఉద్దేశ్యం సరైనదే" అన్నట్టుగా సన్నగా నవ్వాడు స్వామీ రావు. అతనిప్పుడు ఉచ్ఛ నీచాలు ఆలోచించే పరిస్తితిలో లేడు కాని ఈ వ్యవహారం ఇంటిదగ్గర కూడా నడవటం అతనికి కొంత ఇబ్బందిగా అనిపించింది.

"ఇంతకీ నువ్వు చెప్పొచ్చేదేమిటి ? సమయం సందర్భం చూడకుండా మన చేతిలో అవకాశం ఉందని ఎలా పడితే అలా అడ్డంగా సంపాదించెయ్యాడ మేనా ? అసలు నీ ధైర్యానికి నాకాశ్చర్యంగా ఉంది. ఎవరైనా మొగుళ్ళను ఇలాంటి పనుల జోలికి పోవద్దని మొత్తుకుంటారు . విచిత్రంగా నువ్వు నా అభివృద్ధిలో భాగం కూడా అయ్యావు " అన్నాడతను నర్మగర్భంగా నవ్వుతూ.

"మీరు నన్ను తక్కువ అంచనా వేస్తున్నారేమో ? మీ వల్ల కోట్లు గడించే అవకాశం ఉన్న మీ సేట్ ను నేను ఊరికే వదలలేదు. నా మెళ్ళో కొత్తగా మెరిసిపోతున్న ఈ బంగారపు గొలుసు ఎలా వచ్చిందనుకున్నారు? " అంటూ చావు కబురు చల్లగా చెప్పింది ఆమె.

కొద్దిసేపు పాటు స్తాణువై పోయాడు స్వామీరావు. ఇప్పుడు తను చిక్కుల్లో పడ్డటయ్యింది. అతని మనసులో ఎన్నో శంకలు తలెత్తాయి. అదే టెండర్ కోసం ప్రయత్నిస్తున్న ఇంకో పార్టీ కూడా తనని నానా రకాలుగా బలవంతం చేసాడు తనకు ఈ ఆర్డర్ వచ్చేటట్టు చూడమని. ఇప్పుడు పొరపాటున కూడా తను అతనికి ప్రత్యర్ధిగా ఉన్న పార్టీకి సహాయం చేసానని తెలిస్తే ఊరూ వాడా ప్రచారం చేసేస్తాడు. పైగా తను పెద్దమొత్తంలో డబ్బు ఆశించానని కూడా చెప్పే అవకాశం ఉంది. . ఒక రకంగా తన భార్య తొందరపాటు పని చేసిందా అనిపించింది. . ఇటువంటి వ్యవహారాలలో ఆవిడను కలిపించుకోనీయకుండా చేసి ఉంటే బాగుండేదేమో అనుకున్నాడు." నీవు నేర్పిన విద్యయే నీరజాక్షి" అన్నట్లు ఏ విషయం దాచుకోకుండా పెళ్ళాంతో ప్రతి విషయం చెప్పేయడం అతని నైజం..

మొత్తానికి స్వామీరావు భార్య అదృష్టమో, తన అదృష్టమో మూడో కంటి వాడికి తెలియకుండా పరిస్తితులు వాటంతట అవే చక్కబడి పోయాయి.

ఈ నేపధ్యంలోనే స్వామీరావు ఒక అందమైన ఇల్లు వాళ్ళ సొంత ఊళ్ళో సమకూర్చుకున్నాడు. ఇప్పుడతని ముందు ఉన్న ముఖ్యమైన కర్తవ్యం వెంటవెంటనే కాకపోయినా ముగ్గురు ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసెయ్యడం. ఒక శుభముహూర్తాన తన ఇద్దరి కూతుళ్ళ పెళ్లి చెయ్యబోతున్నాడన్న విషయం బయటకు పొక్కడంతో అతని కస్టమర్లు పోటీపడి స్వామీ రావు చేత ఒక్క పైసా కూడా ఖర్చు పెట్టనీయకుండా మొత్తం బాధ్యతను నెత్తిమీద వేసుకున్నారు. ఆ పెళ్ళికి స్వామీరావు తన డిపార్టుమెంటులోని వాళ్ళనే కాకుండా చాలా మందిని పిలవలేదు. కారణం పెళ్ళిలో తన కస్టమర్ల సేవలు, వాళ్ళు పెట్టే ఖర్చు బయటపడి పోతుందని. అడ్డ దారుల్లో డబ్బు సంపాదించడం ఇంత సులువా అని చాలా మందికి అనుమానం రాక మానదు. తెలివితేటలతో ముందు జాగ్రత్తతో ప్రతి క్షణం, అనుక్షణం ముందూ వెనకా చూసుకుంటూ అందరిని బాలన్స్ చేసుకుంటూ అవతల వాళ్లకు కూడా తినిపిస్తూ పోతే ఏదైనా సాధ్యమే అని స్వామీరావును దగ్గరగా చూసిన వాళ్ళు చాలామంది అనుకుంటూ వుంటారు.

సడన్గా స్వామీరావు పనిచేస్తున్న మానేజ్మెంట్ మారింది. దాంతోపాటు కీలకమైన సీట్లలో కొత్త మేనేజ్మెంట్ వాళ్ళ వాళ్ళను అప్పాయింట్ చేసుకుంది. చిన్నా చితకా స్కాముల్లో ఉన్న వాళ్ళందరూ వేరే

దారి దొరక్క అక్కడే కొనసాగుతూంటే వాళ్ళందరిలో అగ్రజుడైన స్వామీరావు మాత్రం తనలాంటి తిమింగలానికి ఏ క్షణాన్నయినా ప్రమాదం పొంచివుండే ప్రమాదం ఉందని ఒకరోజు హడావిడిగా మీటింగ్ పెట్టి తను తన కుటుంబంతో సహా తన సొంత ప్రాంతానికి వెళ్ళిపోతున్నట్టు డిక్లేర్ చేసాడు.

ఒక రోజు స్వామీరావు ఆంతరంగిక మిత్రుడు గోపాలం నా దగ్గరికొచ్చి "భాస్కర్ ఈ విషయం విన్నావా మొన్నీ మధ్య స్వామీరావు తీవ్రమైన గుండెనొప్పితో హాస్పిటల్ కెళ్ళే లోపలే చనిపోయాడుట. సమయానికి అమెరికాలో వున్న అతని ముగ్గురు కూతుళ్ళు దగ్గరగా కూడా లేరుట. దొంగ దారుల్లో డబ్బు సంపాదించడమే జీవిత పరమావధిగా బతికాడు. చివరకు ఏం సాధించాడు ? అతనికి తోడు అతని భార్య కూడా ముందుండి అతన్ని ప్రోత్సహించింది. మొదటినుండి అతను చేస్తున్న ప్రయత్నాలను నేను ఖండించే వాడిని. .. వింటే కదా ? మనిషనే వాడు ఎప్పటికైనా చనిపోవాల్సిందే. కాదనను. కాని బోల్డంత జీవితం ముందుంచుకుని బ్రతికినంత వరకు డబ్బే ప్రధానంగా పెట్టుకుని చివరకు అర్ధాంతరంగా అన్నీ వదిలి పెట్టి వెళ్లి పోయాడు. .." అంటూంటే అప్రయత్నంగా అతని కళ్ళు నీళ్ళు చిమ్మాయి.

స్వామీరావు వ్యక్తిగతంగా ఎటువంటివాడైనా కాని వ్యక్తిగా మా అందరితో చాలా చనువుగా , ఎప్పుడూ నవ్విస్తూ ఏ విషయంలోనూ దాపరికం లేకుండా సరదాగా మాట్లాడేవాడు.. అతను పోయాడన్న వార్త గోపాలం ద్వారా తెలుసుకున్నాక చెప్పొద్దూ నా మనసు వికలమై పోయింది. అతనికి మనసులోనే శ్రద్ధాంజలి ఘటించుకున్నాను.




ప్రశాంతి పుర రాజ్యానికి మహారాజు ప్రవీణ వర్మ . పేరుకు తగ్గట్లే అతడు చాలా తెలివైన వాడు. ప్రజలకు ఏ లోటూ లేకుండా కన్న బిడ్డల్లా పాలించ సాగాడు. అంతా అతడ్ని తమ పాలిటి దేవునిలా ప్రేమించే వారు. ప్రవీణ వర్మకు ఒకే ఒక లోటు, అదేమంటే సంతాన లేమి. మహా రాణి మల్లిక ఎన్నో పూజలూ వ్రతాలు, దాన ధర్మాలు చేసింది. చివరకు ఒక యోగి సలహాతో ప్రవీణ వర్మ పుట్టిన రోజు పండక్కి తమ రాజ్యం లోని పిల్లలందరినీ రప్పించి తమ రాజ ప్రాంగణం లోని విశాల మైదానంలో పందిళ్ళు వేయించి రోజంతా వారితో గడుపుతూ వారి ముద్దు మాటలు వింటూ ఆటలు ,పాటలకు ఆనందిస్తూ రోజంతా గడిపేవారు రాజూ, రాణి.

పిల్లలందరకూ నవకాయ పిండి వంటలతో భోజనాది కాలు ఏర్పాటు చేసేవారు. వారు సంతోషంగా తింటూ ఉంటే స్వయంగా అడిగడిగీ , వడ్డిస్తూ తమకున్న లోటును ఆ రోజు మరచేవారు. ఇలా కొంత కాల మయ్యాక ఇహ తమ కు సంతానం కలుగదేమో అనే భావన ప్రవీణ వర్మ కు వచ్చింది. ఆ పుట్టిన రోజు నాడు పిల్లలకు వడ్డిస్తున్న సమయంలో తమ మహా మంత్రి, కుల గురువూ కూడా అక్కడ ఉండగా వారితో తన మనస్సులోని భావనను వెలి బుచ్చాడాయన. అపుడు వారిరువురూ ప్రవీణ వర్మ తో ఒక మాట చెప్పారు. పిల్లలంతా రాత్రి భోజనాలు చేస్తుండగా మహామంత్రి ఆ మధ్యలోకి వచ్చి ఇలా ప్రకటించాడు.

"బాలలారా! మీరంతా మహారాజు కోసం ఒక పని చేయాలి. ఆయన ఇంత కాలంగా మిమ్ములనందరనూ తన పుట్టు పండుగ రోజు ఆహ్వానించి విందు చేస్తున్నారు కదా! వారి కోసం మీరు ఒక పని చేస్తారా ! అనగానే పిల్లలంతా , " చేస్తాం , తప్పక

చేస్తాం, చెప్పండి " అన్నారు. మహా మంత్రి " బాలలారా! మీరు ఇప్పుడు తింటున్న ఆహారం లోని ఒక గింజను తీసి ఉంచుకుని , ఇంటికెళ్ళి అలాంటి గింజలను సేకరించి నాటి వచ్చే సం. మహారాజు గారి పుట్టిన రోజుకు ఆ మొక్కను, దాని పూలూ, కాయలతో సహా తెచ్చి చూపాలి. ఎవరి మొక్కైతే బాగా పెరిగి , పూలూ కాయలూ ఇస్తుందో వారికి మహారాజు గారు మంచి బహుమతి ఇస్తారు." అని ప్రధాన మంత్రి ప్రకటించగానే , పిల్లలంతా వారు తింటున్న పదార్థాలలోని మిరప గింజలను, ఆవ గింజలను, పులుసులోని గుమ్మడి గింజలను, కూరల్లోని చిక్కుడు గింజలనూ అన్నింటినీ తీసి నీళ్ళలో కడిగి భద్ర పరుచు కున్నారు. ఆ తర్వాత ఇళ్ళాకెళ్ళి పోయారు.

ప్రవీణ వర్మ రాచ కార్యకలాపాల్లో పడి ఆ విషయం మనస్సులో అడుగున పడింది. ఐతే తర్వాతి సం. పుట్టిన రోజుకు పిల్లల్లంతా వారి తల్లిదండ్రుల సాయంతో తలా ఒకటీ రెండూ, మూడూ చొప్పున మొక్కలున్న మట్టి తొట్లు పట్టుకొచ్చి ఆ మైదానంలో వరుసగా పెట్టి , వాటి వద్దే తాము కూర్చున్నారు.

ఇంతలో మహారాజు ప్రవీణ వర్మ, రాణి, ప్రధాని, కులగురువూ అంతావచ్చి వరుసగా వాటిని చూడసాగారు . ఆ పిల్లలంతా తాము ఎంత కష్టపడి ఆ మొక్కలను పెంచిందీ చెప్పసాగారు. మధ్యలో ఉన్న ఒక పిల్లవాడు తాను తెచ్చిన మామిడి మొక్కను చూపాడు ."మహారాజా! గత సం. తమ పుట్టిన రోజునాడు తాము మాకిచ్చిన విందులోని మామిడి పండు తిని ఆ టెంకను నేను ఇంటికి తీసు కెళ్ళి ఈ మట్టి తొట్టిలో నాటాను. అది మెల్లిగా మొలిచి ఈ రోజుకు ఈ మాత్రం పెరిగింది. దీని కోసం నేను పెద్దగా చేసిందేంలేదు. రోజూ ఉదయం సాయంకాలం నేను స్నానం చేసేప్పుడు ఒక చెంబు నీరు పోసానంతే. మా ఇంట్లో ఉన్న ఆవు పేడ ఎండి నది అప్పుడప్పుడూ వేసేవాడ్ని.ఐతే మహారాజా! ఈ మామిడి మొక్క పూలూ, కాయలూ ఇవ్వాలంటే మరో నాలుగై దేళ్ళు పట్ట వచ్చు, ఐతే మామనవలూ, మునిమనవలూ కూడా ఈ చెట్టు పండ్లు తింటారు. ఇది చాలా సం. రాలు ఫలాల నిస్తుంది, ఎందరో తిని సంతోషిస్తారు. " అని చెప్పాడు.

ప్రవీణ వర్మ మహారాజు ఆ పిల్లవాని మాటలకు చాలా సంతోషించి " నీపేరేంటి ?" అని అడిగాడు. దానికతడు "మహారాజా ! నా పేరు ప్రజ్ఞాన్ “ అని చెప్పగానే మహారాజు సంతోషంతో " నేను ఈ పిల్లవానిని నా తదుపరి పాలకునిగా స్వీకరిస్తూ , దత్తత తీసుకుని, విద్యాబుద్ధులు చెప్పించి , రాచ విద్యలు నేర్పిస్తాను. ఇలా పది కాలాల పాటు పదిమంది మేలు కోరే వారే నిజమైన పాలకు లవుతారు. " అని చెప్పి దానికి తగు ఏర్పాట్లు చేయించాడు.

నీతి -ఏ పని చేసినా కేవలం స్వార్థాన్నే కాక అందరి కోసం ఆలోచించే వాడే నిజమైన మానవుడవుతాడు. భగవంతుని ఆశీర్వాదాలు అలాంటి వారికే దక్కుతాయి.




ఏయ్ బాబూ! మీ అమ్మ చేసిన ఘనకార్యం చూశావా ? .. బాబీ మెట్లమీద జారి పడి తల పగలగొట్టు కున్నాడు.మీ అమ్మ పౌడర్ రాసి పడుకోబెట్టింది.నువ్వు రిఫ్రెషైతే క్లినిక్కు తీసుకెళ్దాం.

బి బ్ సి లెవెల్లో ఎఫ్ ఐ ఆర్ చదివేసింది..రమ వైఫాఫ్ రాంబాబు..భర్త యింకా పూర్తిగా యింట్లో కాలు పెట్టక ముందే.

" తల పగిలిందా."?     ఆతృతగా అడిగాడు..రాంబాబు..ఆందోళనతో..

మంచంమీద ఆదమరచి నిద్ర పోతున్న రెండున్నరేళ్ల బాబీని పరీక్షగా చూస్తూ.

"ఐమీన్ పగలడం అంటే..బ్రేకయ్యిందని కాదు..బాగా గీసుకు పోయింది."

ఎఫ్ ఐ ఆర్ కు చిన్న ఎమండ్ మెంట్ యిచ్చింది.

" అమ్మేందిగా ..అలా ఎలా జరిగింది..?"

అమ్మా !      అరవ ..బోయి..ఉయ్యాల్లో హాయిగా నిద్రపోతున్న కొడుకెక్కడ లేస్తాడోన్న భయంతో ఆగి పోయాడు.

"ఇంకెక్కడుంది ఆ మహాతల్లి..నేను రాగానే..బాబీగాడి కథ చెప్పి బలాదూరు      పోయింది." కసిగా అక్కసు కక్కేసింది.

"అమ్మలా చేయదే.".సణిగినట్టు గొణిగాడు..రాంబాబు.

"ఆహా ..మీ అమ్మనేదో పూర్తిగా చదివేసినట్లు ..సెలవిస్తున్నారు..నేను నోరిప్పితే తెలుస్తుంది..ఎప్పుడు చూసినా .. బాబీ గురించి పట్టించుకుంటే ఒట్టు.లక్ష సార్లు మొత్తుకున్నా..వింటేగా. అయినా మనమేమైనా రాళ్లెత్తమన్నామా..కట్టెలు కొట్టమన్నామా..మీ అమ్మను వెలగ బెట్టమంది ఇంటి పని      వంటపనేగా..ఇంత వయసొచ్చింది..ఏం లాభం..?"

ఇంటికీ వంటకూ బాబీ గాడి ఆయాఖర్చులకు పాతికవేల పైమాటేన్న చేదు నిజాన్ని మనసులోనే కుక్కేసుకుంటూ..అతి తేలిగ్గా తీసిపారేసింది..అత్తగార్ని..ఆంధ్రమహిళాసభ రిటైర్డ్ ప్రిన్సిపాల్ అరుణామేడంని.

"రమా! దిసీజ్ నాట్ ద ఫస్ట్ టైం..మీ అత్తాకోడళ్ల మధ్య నేను నలిగి పోతున్నాను.."

"నేనూ అదే మొత్తుకుంటున్నాను..మీ అమ్మని హోంలో..బాబీని కేర్ సెంటర్ లో..పడేద్దామని ఆర్నెల్ల నుండి తల బద్దలు కొట్టుకుంటున్నాను..అమ్మంటే వణుకు.. పెళ్లాం మాటంటే..అలుసు..ఇవ్వాళ మీరు నోరు తెరవకపోతే..మీకూ నాకూ రాం..రాం..రేపే బాబీతో బండెక్కేస్తా ..ఇప్పుడే మా అమ్మతో చెప్పేస్తా..మళ్లీ చస్తే ఈ గడప తొక్కను.."

లంకంత ఇల్లది. క్రింద మూడు బెడ్ రూంలు హాలు..పైనా అంతే..కార్పొరేట్ కంపెనీకి ఓ పోర్షన్ అద్దెకిస్తే యాభై వేలు రెంటు యిప్పిస్తానన్న బ్రోకర్ కు యిచ్చిన మాట ఎలాగైనా నిలబెట్టుకోవాలన్న నిర్ణయంతో మంకు పట్టు పట్టేసింది రమ. .

ఆర్నెల్ల..తన పోరుకో తుది రూపమివ్వాలన్న..ధృఢ నిశ్చయంతో.

"రాత్రి అమ్మతో నేను మాట్లాడుతా..నువ్వేమి తొందర పడకు.. "

తన రూంలోకి వెళ్లి పోయాడు..రాంబాబు..తన చేతగాని తనానికి చరమ గీతం పాడాలన్న ఆలోచనతో.

భర్త వాలకాన్ని గమనిస్తున్న రమ తన పధకం పారబోతోందన్న ఊహ కే వూగిపోయింది. ఆమె పెదాల మీదో వంకర నవ్వు..తొంగి చూసింది .

*****

పది దాటిపోతుండగా వచ్చింది..అరుణామేడం..ముఖంలో అలసట విచారం..నిద్రపోకుండా హాల్లో కూర్చున్న రాంబాబు రమలను విస్మయంగా చూస్తూ..చిన్నగా నవ్వుకుంది.

"బాబూ! బాబి ఎపిసోడ్ ఆల్రెడీ నీ భార్యామణి తన ఓన్ వెర్షన్ లో నెరేట్ చేసే వుంటుంది. నా డాక్టర్ ఫ్రెండ్ అప్పుడే వచ్చి చూసి చిన్నగా గీసుకు పోయిందని ఆయింట్ మెంట్ రాసింది. గుడ్ నైట్ బోతాఫ్ యు..రేపు ఎర్లీగా వెళ్లాలి..వీలైతే మళ్లీ నైటు కలుద్దాం.."

మరో మాట లేకుండా తన గది లోకెళ్లి తలుపు వేసుకుంది.

అమ్మ ధోరణి అర్ధం కాని రాంబాబు నోరు తెరిచేస్తే..మోచేత్తో డొక్కలో పొడిచి .. విస విసా గది లోకెళ్లి పోయింది..రమ..పట్ట రాని కోపంతో.

******

నిద్ర లేచి హాల్లో కొచ్చిన రమా రాంబాబులు డైనింగ్ టేబుల్ మీద ఫ్యాన్ గాలికి రెప రెప లాడుతున్న పేపర్ వెయిట్ క్రిందున్న కాగితాన్ని చేతుల్లోకి తీసుకున్నారు. ఇద్దరూ ఆత్రంగా చదవడం మొదలు పెట్టారు.

“ ఒరే చవట బాబూ!..రాత్రి మీ యిద్దరినీ..అలా చూసినప్పుడు ఈ మధ్య టీవీ లో వస్తున్న” చవట మొగుడు..చాడీల పెళ్లాం “ గుర్తొచ్చి పడీ పడీ నవ్వాలనిపించింది. చెత్త విషయాలలో నన్ను కన్విన్స్ చేసే ముందు..చిన్నప్పటి నుంచి నువ్వు చూపే హావ భావాలు..బాడీ లేంగ్వేజ్..ఫ్లాషై ఆర్నెల్ల నుండి నీ పెళ్లాం నా బుర్ర లోకి ఎక్కిస్తున్న హోం గురించి .. తాడో పేడో తేల్చేసి నేను “చవట మొగుడ్ని” కాదు అని అనిపించు కోడానికిని రెడీ అయిపోయినట్లనిపించింది. యామై కరెక్ట్”..?

తన మనసును తనే చదువుకున్నట్లున్న ఆ వాక్యాల్ని చూస్తూనే తన చెప్పుతో తనే కొట్టుకున్న ఫీలింగుతో సిగ్గుతో పెళ్లాన్ని చూశాడు.

“ చిన్న వయసులోనే భర్తను కోల్పోయి..పునర్వివాహం కోసం అమ్మా నాన్నలెంత పోరాడినా..నా బిడ్డల భవిష్యత్తే నా భవిష్యత్తనుకొని ..మనసును బండ రాయిలా మార్చుకుని ..జీవన పోరాటం చేశాను. నీ అన్న లవ్ మేరేజని రాష్ట్రం గాని రాష్ట్రానికి దారి చూసుకున్నాడు . మిగిలింది నువ్వు. నువ్వు నీ దారేదో చూసుకోకుండా పెళ్లాం దారిలో పడి అమ్మకో అనాధాశ్రయానికి దారి చూపించాలనుకున్నావ్. భేష్.

నిన్న సాయంత్రం నాతో బాటు పని చేసిన ఆయా భర్త యాక్సిడెంటులో చని పోయారని తెలిసి వెళ్లాను. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు. నిస్సహాయంగా నిలబడి సాయం కోసం పిల్లల భవిష్యత్తు కోసం అందరినీ అర్థించింది . ఒకప్పటి నా పరిస్థితి నాకు గుర్తొచ్చింది. మీనాన్న యిచ్చిన ఆస్థి..అమ్మా నాన్నల అండ నన్ను బ్రతికించింది. ఆయా భర్త తాగుబోతు..చవట..ముగ్గురు ఎదిగొచ్చిన ఆడ పిల్లలతో నిస్సహాయరాలుగా నిల బడి వుంది.

నీ సోదరుడెప్పుడో అమ్మని ..అమ్మ ప్రేమని వద్దనుకున్నాడు. ఇప్పుడు నువ్వు కూడా ఆ దారిలో నే వున్నావు. భార్య రానంత వరకే అమ్మా నాన్నలు అండా దండ..ఆ తర్వాత గుది బండలే..నాలో ఎదిగి..నా రక్త మాంసాలు పంచుకొని..నా ఒడిలో పెరిగిన నీకే నేను అక్కర లేనప్పుడు..నువ్వు మాత్రం నా కెందుకు.. నన్ను అభిమానించే నా విద్యార్థులందరూ నా బిడ్డలే . ప్రపంచం లోని గానుగెద్దులన్నీ చక్రం లాంటి గీత చుట్టూ తిరుగుతూ చివరకు తన గమ్యం కబేళాకేనని తెలుసు కోలేక అదే మాయలో తాను తన యజమాని సేవలో తరిస్తున్నానని బతికేస్తుంటుంది. అలాగే పిచ్చి తల్లులు .. తండ్రులు కూడా. కంటికి రెప్పలా కాపాడిన తల్లి తండ్రుల్ని కడుపున పుట్టిన పుత్రులు చివరకు చేర్చేది అనాధాశ్రమాల వంటి హోమ్ లకే నన్న నిజాన్ని గ్రహించ లేక బాంధవ్యాల భ్రమల్లో జీవితాలను త్యాగం చేసుకుంటున్నారు. కళ్లను కప్పేసిన మమకారమనే పొరల్లో నేనూ అలానే బ్రతికాను. వయసును గుర్తు చేసి నీ చాడీల పెళ్లాం..హోమ్ లో చేర్చాలన్న నీ తపన..నా కళ్లు తెరిపించాయి.

తెంచుకోవాలనుకుంటున్నావ్..హాయిగా తెంచుకో. నేను పంచుకోవా లను కుంట న్నాను..పంచుకుంటాను..పెంచుకుంటాను..ఆయా పిల్లల్ని. "ఆయా.". పిల్లలతో నాతోనే ..ఈ ఇంట్లోనే .".నా ఇంట్లోనే "వుంటుంది. నాకు గతుల మీద..పున్నామ నరకాల మీద..తల కొరువుల మీద నమ్మకాలు లేవు. బ్రతికున్నప్పుడే నరకాలు చూపిస్తున్న..పుత్రులు పున్నామన రకాలు దాటిస్తారన్నది ట్రాష్. భ్రమ.

మీరిద్దరూ సంపాదన పరులు. మని మేక్స్ మెని థింగ్స్..నేను వారం రోజుల వరకు రాను. కోర్టు సమక్షంలో చట్ట పరంగా అమ్మాయిల దత్తత వ్యవహారాలు చూసుకొని వస్తాను. మీ అన్న అడుగుజాడల్లో అత్తారింటి దారే వెదుక్కుంటావో.. అద్దింటి దారే కనుక్కుంటావో ..నీ యిష్టం. ఇట్స్ నన్ ఆఫ్ మై బిజినెస్. మరీ రేపే ఇల్లు ఖాళీ చేయించాలను కొనేంత కఠినాత్ము రాలిని కాదు. ఎంత చవటవైనా నేను కన్న బిడ్డవే కదా.. వారం రోజులు గడువిస్తున్నాను. ఇంటి కీస్ మన లొకాలిటీలో వున్న ఒక నాటి నా విద్యార్థి నేటి యస్ పీ..అనురాధ కివ్వు. మార్నింగే ఫోన్ లో..మన "కహానీ" చెప్పాను. మిమ్మల్ని హోముకు పంపిస్తానన్నట్లు..చిన్న కంప్లెయింటివ్వండి..రాజమండ్రి హోముకు పంపిస్తానంది. అత్యాశ కదా మీది..ఫ్రీ ఫుడ్ ఫ్రీ బెడ్..మీకు ఓకే ఐతే నాకూ ఓకే.. కానీ నాది కన్న కడుపు. మీలాంటి చీమూ నెత్తురూ లేని బతుక్కాదు. ఇక ముందు జీవితంలో మీ ముఖాలు చూపించి నేనూ సమాజం అసహ్యించుకునేలా చేయకండి.

గుడ్ బై. " వికటించిన తన పాడు వ్యూహం తనకే వెన్నుపోటు పొడిచిన ఫీలింగ్ నిస్తే..

రేపటి నుండి ఇంటి అద్దెలో బాటు ఇతర ఖర్చులు యాభై వేల పై మాటే" అమ్మో వామ్మో" అనుకుంటూ..కళ్లు తేలేసింది..రమ..ఉరఫ్ రమాదేవి.

అమ్మకు చేయాలనుకున్న తన ద్రోహం తన జీవితానికే యమ పాశంలా చుట్టు కుందనే కఠోర సత్యం అర్థమై పాతాళం లోకి కూరుకు పోయినట్లు కూలి పోయాడు.. రాంబాబు ఉరఫ్ చవట బాబు.